ఈనాడు
వైయస్ఆర్
బుధవారం అక్టోబరు 16, 2024



పీలేరు సమీప అటవీ ప్రాంతంలో సంచరిస్తున్న ఏనుగుల గుంపు

అదో ఏనుగుల గుంపు... తలకోన అటవీ ప్రాంతం నుంచి అప్పుడప్పుడు జిల్లా సరిహద్దులోని గ్రామాల్లోకి చొరపడుతుంటుంది... వాటి కంట పడ్డారో అంతే సంగతులు. గ్రామంలోకి వస్తే విధ్వంసం, పంట పొలాలపై పడితే సర్వ నాశనం, మనుషులు ఎదురు పడితే మరణశాసనం. అంత ప్రమాదం లేదులే అనుకున్న ప్రతి సారీ తమ ఉనికిని చాటుకుంటూ గజరాజులు వణికిస్తున్నాయి. మంగళవారం మరో రైతు భయం'కరి' ఘాతికి మృత్యువాత పడ్డారు. ఈ గుంపు నుంచి రక్షణ కల్పించాలని సరిహద్దు గ్రామాల వారు కోరుతున్నారు.

భయంకరి

16 పీలేరు మండలంలో సంచరిస్తున్న గుంపులో 16 ఏనుగులు ఉన్నాయి.. అందులో నాలుగు గున్న ఏనుగులు

గుంపు కంటపడితే మరణమే

తరచూ ప్రమాద ఘంటికలు

ఇప్పటి వరకు ఏనుగుల దాడిలో మృత్యువాత పడిన వారు **5** మంది



\- న్యూస్‌టుడే, పీలేరు గ్రామీణ, కలికిరి గ్రామీణ

పీలేరు మండలంలో ఏనుగుల గుంపు సంచారం సంచలనం రేకెత్తించింది. సుమారు 15 ఏనుగుల గుంపు సోమవారం రాత్రి పీలేరు మండలంలోకి ప్రవేశించాయి. వారం రోజులుగా చిత్తూరు జిల్లా పులిచెర్ల మండల పరిధిలోని అటవీ ప్రాంతంలో ఈ ఏనుగులు సంచారం ఉంది. ఈ మండలానికి పక్కనే పీలేరు మండలం ఉండడంతో ఆ గుంపు ఇక్కడికి ప్రవేశించింది. పీలేరు మండల పరిధిలో ఏనుగుల సంచారం ఇదే మొదటిసారి. ఇవి ఒకసారి ప్రవేశించాయంటే ఆ ప్రాంతంలో ఉండే పంట పొలాలపై పడి విధ్వంసం సృష్టిస్తాయి. కనపడిన మనుషులను తొక్కి చంపేస్తాయి.

గతంలో జరిగిన ఉదంతాలివి...

- కలికిరి-వాల్మీకిపురం మండలాల సరిహద్దులోని గుట్టపాళెం, మేకలవారిపల్లె అటవీ ప్రాంతంలోకి ఫిబ్రవరిలో రెండు ఏనుగులు దారి తప్పి వచ్చాయి. అటవీ శివారు ప్రాంతంలోని అరటి, వరి, టమాట పొలాలను తొక్కి, నష్టపరిచాయి. చిత్తూరు జిల్లా సోమల, చౌడేపల్లె అటవీ ప్రాంత సరిహద్దుల నుంచి దారి తప్పిన ఏనుగులు ఇక్కడికి రావడంతో గ్రామస్థులు భయాందోళనలకు గురయ్యారు. పొలాల వద్ద ఏనుగుల సంచారాన్ని చూసిన పలువురు రైతులు అటవీశాఖ అధికారులకు సమాచారం చేరవేయడంతో వారు అప్రమత్తమయ్యారు.
- ఏడాది కిందట దారి తప్పిన ఒంటరి ఏనుగు కలికిరి-వాల్మీకిపురం మండలాల సరిహద్దుల్లోని అరటి తోటపై పడి విధ్వంసం సృష్టించి పంటకు తీవ్ర నష్టాన్ని కలిగించింది.
- అయిదేళ్ల క్రితం పలమనేరు మొగిలి అటవీ ప్రాంతం నుంచి వచ్చిన ఓ ఒంటరి ఏనుగు రామసముద్రం సమీపంలో కొండపై చిక్కుకుపోవడంతో శిక్షణ పొందిన మరో రెండు ఏనుగుల సాయంతో దానిని కొండ దింపారు. అయితే ఇదే ఏనుగు బుసానికిరపల్లె గ్రామంపై పడి ఓ వృద్ధుడిని కాళ్లతో తొక్కి చంపేసింది.
- మదనపల్లెలో గ్రామ మూసి సీటీఎం మీదుగా వాయల్పాడు వెళ్తున్న తండ్రీ కొడుకులపై ఏనుగులు దాడి చేసి చంపేశాయి. అయిదేళ్ల క్రితం జరిగిన ఈ ఘటన అప్పట్లో సంచలనం రేకెత్తించింది. ఇలా ఇప్పటికే అనేక మంది ఏనుగుల గుంపు చేతిలో మృత్యువాత పడ్డారు.
- పదేళ్ల కిందట ఇదే మండలం చిన్నరంపెద్దిగారిపల్లె సమీపంలోని వ్యవసాయ పంట పొలాలపై ఏనుగుల గుంపు పడి పంటను ధ్వంసం చేశాయి.
- 15 ఏళ్ల క్రితం కంభంవారిపల్లె మండలం జిల్లేళ్లమంద సమీపంలోని వ్యవసాయ పొలాల్లో ఏనుగుల గుంపు సంచరించింది. వ్యవసాయ పంట పొలాలను ధ్వంసం చేయడమే కాక ఓ రైతును కూడా పొట్టన పెట్టుకున్నాయి.

కుంకీ ఏనుగులు ఏమయ్యాయి?

అటవీ ప్రాంతంలో ఉండే ఏనుగుల గుంపు దారి తప్పి గ్రామాల సమీపంలోకి వచ్చి పంటను ధ్వంసం చేయడం, ప్రాణ నష్టం కలిగించడం చేస్తుంటాయి. ఇలాంటి ఏనుగుల గుంపును తరమడానికి అటవీశాఖ అధికారులు పర్యవేక్షణలో శిక్షణ తీసుకున్న కుంకీ ఏనుగులను వినియోగిస్తారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా రామకుప్పంలో ఈ కుంకీ ఏనుగులు ఉన్నాయి. వీటి ద్వారా ఇక్కడ నక్కి ఉన్న ఏనుగుల గుంపును తరిమివేసే అవకాశం ఉన్నా అధికారులు ఈ చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం కర్ణాటక రాష్ట్రంలో కుంకీ ఏనుగుల బృందంతో ఒప్పందం కుదుర్చుకున్నారు. వీటిని రప్పించాలని కోరుతున్నారు.

బాధ్యులెవరు?

పులిచెర్ల మండలంలో ఏనుగుల గుంపు సంచారం విషయం అటవీశాఖ అధికారులకు తెలిసినా ముందస్తుగా సమీప ప్రాంతాలను హెచ్చరించి ఉంటే ప్రాణనష్టం జరిగేది కాదు. పులిచెర్ల, సోమల, చౌడేపల్లె, పులిచెర్ల అటవీ ప్రాంతాల్లో తరచూ ఏనుగుల సంచారం అధికంగా ఉంటుంది.

ప్రాణ భయంతో ఏనుగులు : దారి తప్పి పంట పొలాలపై పడే ఏనుగుల గుంపు పిల్ల ఏనుగుల రక్షణకు ప్రాధాన్యమిస్తాయి. ఈ క్రమంలో కంట పడ్డ వారిని సైతం ప్రాణ భయంతోనే తొక్కి చంపే పరిస్థితి ఉంటుంది. ఏనుగుల గుంపును చూడానికి జనాలు తరలి రావడంతో ఎటూ పోలేని స్థితిలో అవి ఉంటాయి. జనసంచారం తగ్గాక అవే వెళ్లిపోతాయి. వాటి జోలికి వెళ్లడం అత్యంత ప్రమాదకరం.
\- శ్రీనివాసులు, ఏడీఎఫ్‌వో, మదనపల్లె

పెద్ద దర్గా ఉరుసుకు ముఖ్యమంత్రికి ఆహ్వానం

కడప, చిన్నచౌకు, న్యూస్‌టుడే: ప్రసిద్ధిగాంచిన కడప పెద్దదర్గా ఉరుసు ఉత్సవాలకు హాజరు కావాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడిని పీఠాధిపతి ఆరిఫుల్లా హుస్సేనీ, నిర్వాహకులు ఆహ్వానించారు. రాష్ట్ర సచివాలయంలో మంగళవారం వారు సీఎంను కలిసి ఆహ్వాన పత్రాన్ని అందజేశారు. అలానే మంత్రి నారా లోకేశ్‌ను కూడా ఆహ్వానించారు. నవంబరు 3 నుంచి పెద్ద దర్గా ఉరుసు ఉత్సవాలు ప్రారంభమవుతాయి. 16న గంధం, 17న ఉరుసు, 18న ముషాయిరా ఉంటాయి.



ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడికి ఆహ్వాన పత్రం అందజేస్తున్న దర్గా పీఠాధిపతి ఆరిఫుల్లా హుస్సేనీ, దర్గా నిర్వాహకులు

జిల్లా ఇన్‌ఛార్జి మంత్రిగా సవిత



ఈనాడు, కడప: జిల్లా ఇన్‌ఛార్జి మంత్రిగా రాష్ట్ర బీసీ సంక్షేమ, చేనేత/జౌళిశాఖల మంత్రి ఎస్.సవితను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. శ్రీసత్యసాయి జిల్లా పెనుకొండ ఎమ్మెల్యేగా గెలిచిన ఆమె జిల్లా ఇన్‌ఛార్జి మంత్రిగా వ్యవహరిస్తూ.. జిల్లాలో జరిగే అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను, పాలనాపరమైన వ్యవహారాలను పర్యవేక్షిస్తారు. ఈ నియామక ఉత్తర్వులు తెలుగులో జారీ చేయడం విశేషం. ఇకపై మంత్రి జిల్లా సమీక్షా కమిటీ (డీఆర్‌సీ), జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశాలకు మంత్రి హాజరుకానున్నారు.

రిమ్స్‌లో స్విమ్స్ వైద్యులు పరిశీలన



సర్వజన ఆసుపత్రి, న్యూస్‌టుడే: కడప ప్రభుత్వ వైద్య కళాశాలలో గైనకాలజీ, డెర్మటాలజీ, పీడియాట్రిక్ విభాగాలకు సంబంధించి పీజీ సీట్లను పెంచేందుకు డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం తరపున స్విమ్స్ వైద్య బృందం డాక్టర్ కిరిటీ, డాక్టర్ శ్రీదేవి, ఇతర వైద్య బృందం మంగళవారం పరిశీలించింది. దీనిపై వారు నివేదిక రూపొందించి, ఎన్ఎంసీకి పంపుతారని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సురేఖ తెలిపారు. వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ విజయభాస్కర్‌రెడ్డి, ఆయా విభాగాల అధిపతులు పాల్గొన్నారు.

ముసురేసింది... ముసుగేసింది

ఇరు జిల్లాలకు రెడ్ అలెర్ట్!
అత్యవసర ఖర్చులకు రూ.కోటి విడుదల
నేటి నుంచి భారీ వానలంటూ హెచ్చరిక

ఈనాడు, కడప, న్యూస్‌టుడే, జిల్లా సచివాలయం

వర్షపాతం మి॥మీలలో

ఒంటిమిట్ట : 42.8	
అట్లూరు : 41.6	సిద్దవటం : 33.8
బద్వేలు : 40.6	వేంపల్లె : 33.6
కడప : 39.2	పోరుమామిళ్ల : 31.6
గోపవరం : 38.6	కాశినాయన : 31.2
బి.కోడూరు : 35.8	చెన్నూరు : 30.2

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం తుపానుగా రూపాంతరం చెందనుంది. గురువారం నాటికి చెన్నై సమీపంలో తీరం దాటుతుందని వాతావరణశాఖ అంచనా వేస్తోంది. దీని ప్రభావంతో బుధవారం నుంచి భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని హెచ్చరిస్తోంది. ఈ నేపథ్యంలో అన్నమయ్యతో పాటు వైఎస్ఆర్ జిల్లాకు అధికారులు రెడ్ అలెర్ట్ జారీ చేశారు. ఇప్పటి వరకు సాధారణ వర్షపాతమే నమోదు కావడంతో పెద్దగా నష్టం వాటిల్లలేదు. అక్కడక్కడ వరి పంట నేలవాలిపోయింది. ఇకపై భారీ వర్షాలు కురిసే పక్షంలో నేలవాలిన పంట కుళ్లిపోయే అవకాశం ఉంది. వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో కాస్త ఉపశమనం లభించింది. రాష్ట్ర ప్రభుత్వం నుంచి వచ్చిన హెచ్చరికల నేపథ్యంలో జిల్లాస్థాయిలో కలెక్టర్లతో పాటు అధికార యంత్రాంగమంతా అప్రమత్తంగా ఉంటోంది. మండల, రెవెన్యూ డివిజన్ స్థాయిలో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేయడంతో బాధితులు సమాచారం అందించి సహాయం పొందడానికి ప్రత్యేకంగా ఫోన్ నంబర్లు అందుబాటులోకి తెచ్చారు. సబ్ కలెక్టర్లు, ఆర్డీవోలు, తహసీల్దార్లు, ఎంపీడీలు ఆయా స్థానాల్లోనే పరిస్థితిని సమీక్షిస్తూ అప్రమత్తంగా ఉంటున్నారు. మంగళవారం పెద్దగా వర్షపాతం నమోదు కాలేదు. బుధవారం నుంచి వానలు భారీగా కురిసే అవకాశం ఉందనే అంచనాలతో ఉన్నారు. అత్యవసర పరిస్థితులను ఎదుర్కోవడానికి జిల్లాకు రూ.కోటి నిధులను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసింది. ఈ నిధులతో భారీ వర్షాలు కురిసే ప్రాంతాలు, లోతట్టు ప్రాంతాలను గుర్తించి రిలీఫ్ క్యాంపులు, రక్షిత తాగునీరు, ఆహారం, ఆరోగ్య శిబిరాలు, పారిశుద్ధ్య కార్యక్రమాల కోసమే అత్యవసర నిధులు వినియోగించాలనే ఆదేశాలు జారీ అయ్యాయి. అత్యవసర పరిస్థితుల్లో వరద బాధితులను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు ఆర్టీసీ బస్సులను అద్దెకు తీసుకోవాలని, విపత్తులు ఎదురయ్యే పక్షంలో వెంటనే సహాయక చర్యలు చేపట్టడానికి ఎస్డీఆర్ఎఫ్, రహదారులు/ భవనాలు, పురపాలక, పంచాయతీరాజ్‌శాఖల బృందాలను వినియోగించుకోవాలని సూచించింది. పరిస్థితిని బట్టి రాష్ట్ర ప్రభుత్వం నుంచి హెచ్చరికలు, సూచనలు కలెక్టర్ల కార్యాలయాలకు అందుతున్నాయి. తుపాను తీరం దాటే సమయంలో రెండు జిల్లాలపై తీవ్ర ప్రభావం ఉంటుందని అధికారులు భావిస్తున్నారు.



కడపలో మంగళవారం రాత్రి కురిసిన వర్షానికి జలమయమైన ఆర్టీసీ బస్టాండు

ఏడు రీచ్‌ల నుంచి ఇసుక సరఫరా

జిల్లా సచివాలయం, న్యూస్‌టుడే: ప్రజలకు సులువుగా, సజావుగా ఇసుక పంపిణీ చేయాలని కలెక్టర్ శివశంకర్ ఆదేశించారు. ఆయన కడప క్యాంపు కార్యాలయంలో సంబంధిత అధికారులు, ఇసుక ఏజెన్సీ నిర్వాహకులతో మంగళవారం సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వానికి మంచి పేరు తీసుకువచ్చేలా ఇసుక సరఫరా ఉండాలన్నారు. ప్రస్తుతం ఏడు ఇసుక రీచ్‌లను అందుబాటులోకి తీసుకువచ్చామని, పెండ్లిమర్రి మండలంలోని నందిమండలం, కొత్త గంగిరెడ్డిపల్లె, కొండూరు, మాచునూరు, వల్లూరు మండలంలోని పైడికాలువ, కొండాపురం మండలంలోని బెడుదూరు, చక్రాయపేట మండలంలోని మారెళ్లమడక నుంచి ఇసుక సరఫరాకు అనుమతులిచ్చామని వెల్లడించారు. వినియోగదారులు సొంతంగా లేదా ప్రభుత్వం ఏర్పాటు చేసిన వాహనాల్లో తీసుకెళ్లవచ్చని చెప్పారు. ప్రతి రోజు ఉదయం ఆరు గంటల నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు ఆన్‌లైన్ లేదా ఆఫ్‌లైన్‌లో ఇసుక బుక్ చేసుకోవచ్చని వివరించారు. గనులశాఖాధికారి సూర్యచంద్రరావు, ఆర్ఐ విమలమ్మ, ఏజెన్సీ నిర్వాహకులు పాల్గొన్నారు.



సమీక్షలో పాల్గొన్న కలెక్టర్ శివశంకర్, జాయింట్ కలెక్టర్ అదితిసింగ్

టెట్‌కు 1,315 మంది హాజరు

కడప విద్య, న్యూస్‌టుడే : జిల్లావ్యాప్తంగా 8 పరీక్ష కేంద్రాల్లో ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) మంగళవారం కొనసాగింది. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ, తిరిగి మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకూ రెండు విడతల్లో పరీక్ష నిర్వహించారు. మొత్తంగా 1,490 మందికి 1,315 మంది హాజరయ్యారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు లేకుండా పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని జిల్లా విద్యాశాఖాధికారి అనురాధ తెలిపారు.

రాయలసీమ యూనివర్సిటీ రిజిస్ట్రార్‌గా విజయకుమార్‌నాయుడు



వైవీయూ (కడప), న్యూస్‌టుడే: కర్నూలులోని రాయలసీమ యూనివర్సిటీ రిజిస్ట్రార్‌గా యోగి వేమన విశ్వవిద్యాలయంలో డిపార్ట్‌మెంట్ ఆఫ్ మెటీరియల్ సైన్స్ అండ్ నానోటెక్నాలజీ సహ ఆచార్యులుగా పనిచేస్తున్న డాక్టర్ బోయ విజయకుమార్‌నాయుడు నియమితులయ్యారు. విశ్వవిద్యాలయంలో శాఖాధిపతిగా, బోర్డ్ ఆఫ్ స్టడీస్ ఛైర్మన్‌గా, ట్రాన్స్‌పోర్ట్ విభాగ సమన్వయకర్తగా, ప్రవేశాల సహాయ సంచాలకులుగా, న్యాక్ కోర్ కమిటీ సభ్యుడిగా పనిచేశారు. పలు ప్రాజెక్టుల్లో పరిశోధనలు నిర్వహించారు. ఈ సందర్భంగా వీసీ కె.కృష్ణారెడ్డి, ప్రిన్సిపల్ ఎస్.రఘునాథరెడ్డి, వైస్ ప్రిన్సిపల్ పి.పద్మ, అధ్యాపకులు అభినందించారు.

కడప కమిషనర్‌గా మనోజ్‌రెడ్డి

కడప నగరపాలక, న్యూస్‌టుడే: కడప నగరపాలక సంస్థ కమిషనర్‌గా మనోజ్‌రెడ్డిని నియమిస్తూ పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. పలమనేరు ఆర్డీవోగా పని చేస్తున్న ఆయనను సెప్టెంబరు 26న కడప కమిషనర్‌గా ప్రభుత్వం బదిలీ చేసింది. అదే నెల 30న ఆయన పురపాలక శాఖ రాష్ట్ర కార్యాలయంలో జాయినింగ్ రిపోర్టు ఇచ్చారు. ఎట్టకేలకు పురపాలక శాఖ ఆయనను కడప కమిషనర్‌గా నియమిస్తూ ఉత్తర్వులిచ్చింది.

జడ్పీ సీఈవో బాధ్యతల స్వీకరణ



కడప ఏడురోడ్లు, న్యూస్‌టుడే : జిల్లా పరిషత్ సీఈవోగా చిలమకూరు ఓబులమ్మ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఆమె అనంతపురం జడ్పీ సీఈవోగా (ఎఫ్ఏసీ) పనిచేస్తూ బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇప్పటి వరకు ఇక్కడ సీఈవోగా పనిచేస్తున్న ఎం.సుధాకర్‌రెడ్డిని పుట్టపర్తి డీఎల్‌డీవోగా బదిలీ చేసిన విషయం విదితమే. గత నెల 22వ తేదీనే బదిలీ ఉత్తర్వులు వచ్చినా, ప్రభుత్వం చేపట్టిన స్వచ్ఛతాహీ సేవ, స్వర్ణాంధ్రప్రదేశ్-2047, ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాలతో పాటు పింఛన్ల పంపిణీ ఉండడంతో ఈ నెల 2వ తేదీ వరకు పాత స్థానాల్లోనే పనిచేయాలని సూచించారు. అనంతరం 3, 4 తేదీల్లో ఓబులమ్మ బాధ్యతలు చేపడతామరని భావించినా రాలేదు. దీంతో ఆమె రాకపై సందిగ్ధత నెలకొంది. ఎట్టకేలకు పది రోజుల తర్వాత ఆమె బాధ్యతలు స్వీకరించారు. ఓబులమ్మ మాట్లాడుతూ... సిబ్బంది సహకారంతో జడ్పీని అభివృద్ధి పథంలో నడిపిస్తామన్నారు. అనంతరం ఆమె కలెక్టరు లోతేటి శివశంకర్‌ను, జడ్పీ ఛైర్‌పర్సన్ జేష్యాది శారదను కలిశారు. జడ్పీ వైస్ ఛైర్మన్ పిట్టు బాలయ్య, రాజశేఖర్‌రెడ్డి, జడ్పీ డిప్యూటీ సీఈవో మైథిలి, పరిపాలనాధికారులు భాస్కర్‌రెడ్డి, నాగిరెడ్డి, నాగభూషణం, ప్రభాకర్‌రెడ్డి, అశ్వర్థరెడ్డి, ప్రభాకర్, విజయభాస్కర్‌రెడ్డి, పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు లంకా మల్లేశ్వర్‌రెడ్డి, సి.శ్రీనివాసులరెడ్డి తదితరులు పుష్పగుచ్ఛాలు అందజేశారు.

హంద్రీనీవా విస్తరణా? లైనింగా?

ఇటీవల చేపట్టిన పనులు ఆపేస్తూ నిర్ణయం
మంత్రి నిమ్మల సమీక్షతో సర్వత్రా చర్చ

ఈనాడు, కడప



హంద్రీ-నీవా కాలువ రేఖా పటాన్ని పరిశీలిస్తున్న మంత్రి నిమ్మల రామానాయుడు (పాత చిత్రం)

హంద్రీ-నీవా విస్తరణ పనులు చేపట్టడంపై రాష్ట్ర ప్రభుత్వం పునరాలోచనలో పడింది. నీళ్లే రాని పరిస్థితిలో కాలువ విస్తరణతో ప్రయోజనం ఏమిటనే ప్రశ్న తలెత్తింది. ఈ పరిస్థితిలో కాలువ విస్తరణ కన్నా... లైనింగ్ పనులు చేపట్టడం ద్వారా వృథా కాకుండా సాగునీరు సాఫీగా వెళ్లడానికి అవకాశం ఉంటుందని భావిస్తోంది. తద్వారా నిర్వహణకు సులభతరంగా ఉంటుందనే అంచనాకు వచ్చింది. దీంతో చేపట్టిన పనులను తాత్కాలికంగా నిలిపివేయాలనే నిర్ణయం తీసుకున్నారు. ● హంద్రీ-నీవా సుజల స్రవంతి పథకం ప్రధాన కాలువ ప్రవాహ సామర్థ్యాన్ని 6,300 క్యూసెక్కులకు పెంచేలా వెడల్పు పనులు చేపట్టాలని వైకాపా ప్రభుత్వం భావించింది. అయితే పనులు చేపట్టిన దాఖలాల్లేవు. టెండర్లు చేపట్టి.. గుత్తేదారును ఎంపిక చేయగా.. చివరలో బిల్లుల విషయంలో సందేహం తలెత్తడంగా పనులు చేపట్టలేదు. కాలువలో కనీసం తట్టెడు మట్టి కూడా తీయలేదు. ఈ పరిణామ క్రమంలో వైకాపా అధికారం కోల్పోవడం, ఎన్డీఏ పగ్గాలు చేపట్టడంతో గుత్తేదారులో ధైర్యం వచ్చింది. ఇటీవల జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు కర్నూలు, అనంతపురం, శ్రీసత్యసాయి, అన్నమయ్య, చిత్తూరు జిల్లాల్లో హంద్రీ-నీవా కాలువ, జలాశయాలను రెండు రోజుల పాటు పరిశీలించారు. రాయలసీమ కరవు రైతుల జీవనాడి హంద్రీ-నీవా ఎత్తిపోతల పథకం కింద అన్నమయ్య జిల్లాలో శ్రీనివాసపురం, అడవిపల్లె జలాశయాలు నిర్మించారు. గత తెదేపా హయాంలో ఫేజ్-2 కింద అనంతపురం, చిత్తూరు, కడప జిల్లాల్లో 26 టీఎంసీలు వినియోగించుకుని 4.05 లక్షల ఎకరాలకు సాగునీరు, పలు గ్రామాలకు తాగునీరు ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. శ్రీసత్యసాయి జిల్లా తనకల్లు మండలం బొంతలవారిపల్లె వద్ద కాలువ 75 కి.మీ నుంచి కుప్పం బ్రాంచి కాలువ మార్గంలో 207 కి.మీ వరకు విస్తరణ పనులు చేపట్టాలని భావించారు. గత అయిదేళ్లుగా కాలువలో నీరే పారలేదు. పైభాగం నుంచి నీరు కిందకు రావడంలేదు. ఈ విస్తరణ పనుల కోసం రూ.1,300 కోట్లు వెచ్చించాలనే నిర్ణయంతో గుత్తేదారును గత ప్రభుత్వంలో ఖరారు చేశారు. మంత్రి నిమ్మల కాలువ పరిశీలన అనంతరం అనుమతి లేకుండా ఇంజినీరింగ్ అధికారులు విస్తరణ పనులు చేపట్టారు. నీళ్లు రాని పరిస్థితిలో కాలువ విస్తరణ ఎందుకంటూ వివిధ రూపాల్లో సలహాలు వచ్చాయి. ఈ పరిస్థితిలో విస్తరణ కంటే కాలువ కాంక్రీట్ లైనింగ్ పనులు చేయాలనే సూచనలు అందాయి. ఈ నేపథ్యంలో మంత్రి.. విజయవాడలోని తన క్యాంపు కార్యాలయంలో అధికారులతో సమీక్షించారు. ముఖ్యమంత్రి చంద్రబాబుతో చర్చించి నిర్ణయం తీసుకునే వరకు తదుపరి పనులు చేపట్టవద్దని, లైనింగ్ పనుల ఆవశ్యకతను ఆయన దృష్టికి తీసుకెళ్లాలనే అభిప్రాయానికి వచ్చారు. విస్తరణ కంటే లైనింగ్ పనులుపై ప్రభుత్వం మొగ్గు చూపుతోంది. ఉన్న కాలువలో అంతరాలు లేకుండా పారించాలనే అభిప్రాయానికి వచ్చారు. మంత్రి రాంప్రసాద్‌రెడ్డి సైతం విస్తరణ కంటే లైనింగ్ పనులు చేపట్టడం ద్వారా నీటి ప్రవాహానికి మార్గం సుగమమం అవుతుందనే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా ఇప్పట్లో విస్తరణ ఆవశ్యకత లేదని, ఉన్న కాలువలో సాగునీరు పారించడానికి ప్రయత్నాలు చేయాలని సూచించారు.

నేటి నుంచి కొత్త మద్యం దుకాణాలు

కడప నేరవార్తలు, న్యూస్‌టుడే: జిల్లాలో నేటి నుంచి ప్రారంభం కానున్న మద్యం దుకాణాలు దక్కించుకున్న వ్యాపారులు మంగళవారం కడప శివారులోని మద్యం డిపోకు వచ్చి సరకు తీసుకెళ్లారు. మొదటి బిల్లును మాధవరం-1కు సంబంధించిన దుకాణదారుడు కె.విష్ణువర్ధన్‌రెడ్డికి ఎక్సైజ్ డిప్యూటీ కమిషనరు జయరాజుకు అందజేశారు. చాలా మందికి ఇంకా దుకాణాల ఏర్పాటుకు గదులు దొరక్క అవస్థలు పడుతున్నారు. బుధవారం నుంచి సరకు పంపిణీ వేగవంతమవుతుందని అధికారులు చెప్పారు. వైకాపా హయాంలో ప్రముఖ కంపెనీల బ్రాండ్లు కాకుండా జేబ్రాండ్లనే అమ్మారు. ఇప్పుడు పాత కంపెనీలకు చెందిన సరకును అందుబాటులోకి తెచ్చారు.



మద్యం దుకాణదారునికి బిల్లు అందజేస్తున్న ఎక్సైజ్ డీసీ జయరాజు, అధికారులు

రోడ్డంతా తవ్వేసి... కష్టాలకు వదిలేసి

మూడేళ్లుగా పూర్తికాని విస్తరణ పనులు

ఈనాడు, అన్నమయ్య, న్యూస్‌టుడే-రాయచోటి: రహదారుల విస్తరణ పనులకు మూడేళ్లుగా గ్రహణం వీడడం లేదు. పనులు చేపట్టి రహదారిని తవ్వేసి వదిలేయడంతో రాకపోకలు సాగించేందుకు వాహనదారులు నరకయాతన అనుభవిస్తున్నారు. ఉమ్మడి కడప జిల్లాలో ఎన్‌డీబీ కింద ఏడు రహదారుల విస్తరణ పనులను మూడేళ్ల కిందట చేపట్టారు. అందులో భాగంగా రాయచోటి-వేంపల్లె ప్రధాన రహదారి 53.6 కిలో మీటర్ల మేర విస్తరణ పనులు రూ.450 కోట్లతో మొదలయ్యాయి. పనులు దక్కించుకున్న గుత్తేదారు ఏడాదిన్నర కిందట మృతి చెందారు. దీంతో పనులు అర్ధాంతరంగా ఆగిపోయాయి. అధికారులు గుత్తేదారుతో చర్చించి మరో గుత్తేదారుకు పనులప్పగించారు. ● రాయచోటి రింగ్ రోడ్డు నుంచి వేంపల్లె వరకు రహదారిని పూర్తిగా విస్తరింపజేశారు. ఈ రహదారిపై మద్దిరేవుల, చక్రాయపేట, వేంపల్లె సమీపంలోని పాపఘ్ని నదిపై వంతెనల నిర్మాణం చేపట్టాల్సి ఉంది. ఇక్కడ డైవర్షన్ రోడ్లు వేసి వంతెన పనులు చేసినా అసంపూర్తిగా వదిలేశారు. లక్కిరెడ్డిపల్లె, చక్రాయపేట, పాయలోపల్లి సమీపంలో రహదారి విస్తరణకు భూ సేకరణ చేయాల్సి ఉన్నా ఆ పనులు కొలిక్కి రాలేదు. గుత్తేదారులు చేయించిన పనులకు బిల్లులు చెల్లించాలని అప్పటి వైకాపా ప్రభుత్వానికి నివేదించినా తీవ్ర జాప్యం చేసింది. దీంతో తాము పనులు పూర్తి చేయలేమని గుత్తేదారులు మిన్నకుండిపోయారు.



పాపఘ్ని నదిపై అసంపూర్తిగా వంతెన నిర్మాణం



లక్కిరెడ్డిపల్లి-చక్రాయపేట మధ్య ఆంజనేయపురం వద్ద సగం తారు పరిచి వదిలేశారిలా...

తరచూ ప్రమాదాలు...

రాయచోటి-లక్కిరెడ్డిపల్లె, చక్రాయపేట, వేంపల్లె, ఎర్రగుంట్ల మీదుగా చాగలమర్రి వరకు ఉన్న ఈ రహదారి రాష్ట్ర రహదారి నుంచి జాతీయ రహదారిగా మార్చారు. అయినప్పటికీ పనుల్లో పురోగతి లేకపోవడంతో ఏళ్ల తరబడి ఈ మార్గంలో వాహనదారులు అవస్థలు పడాల్సి వస్తోంది. కంకరపరిచి వదిలేయడంతో తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఉన్నతాధికారులు చొరవ తీసుకుని పనులు వేగవంతం చేసి సకాలంలో పూర్తి చేయాలని వాహనచోదకులు కోరుతున్నారు. ఈ విషయమై జాతీయ రహదారి ఏఈ రఘునాథబాబు మాట్లాడుతూ.. సంబంధిత గుత్తేదారు మృతి చెందడంతో పనులు ఆలస్యమయ్యాయని.. త్వరలోనే పూర్తి చేస్తామని వివరించారు.


అధికారులతో సమీక్షిస్తున్న జిల్లా రెవెన్యూ అధికారి గంగాధర్‌గౌడ్

వందశాతం అక్షరాస్యత సాధించాలి

జిల్లా సచివాలయం, న్యూస్‌టుడే: జిల్లాలో వందశాతం అక్షరాస్యత సాధించేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని జిల్లా రెవెన్యూ అధికారి గంగాధర్‌గౌడ్ పేర్కొన్నారు. జిల్లాలోని వయోజనులందరినీ అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలన్నారు. ఇందుకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం న్యూ ఇండియా లిటరసీ ప్రోగ్రాంలో ఉల్లాస్ పథకాన్ని రూపొందించినట్లు తెలిపారు. కలెక్టరేట్‌లో మంగళవారం అండర్‌స్టాండింగ్ ఆఫ్‌లైఫ్ లాంగ్ లెర్నింగ్ ఫర్ ఆల్ ఇన్ సొసైటీ పథకంపై జిల్లా స్థాయి సమావేశం జరిగింది. డీఆర్వో మాట్లాడుతూ ఈ నెల 16 నుంచి 24వ తేదీ వరకు సర్వే చేసి నిరక్షరాస్యులను గుర్తించాలని సూచించారు. నవంబరు ఐదో తేదీ నుంచి మార్చి 15వ తేదీ వరకు ప్రాథమిక అక్షరాస్యత, సంఖ్యాశాస్త్రం, జీవన నైపుణ్యాలు, వృత్తినైపుణ్యాలు, నిరంతర విద్య వంటి అంశాలపై శిక్షణ ఇస్తామన్నారు. డీడీ సుబ్బారెడ్డి, డీఆర్‌డీఏ పీడీ ఆనంద్ నాయక్, డీఈవో అనురాధ, నోడల్ అధికారి సుబ్రహ్మణ్యం, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.


ఆందోళన చేస్తున్న ఏఐఎస్‌బీ నాయకులు

అవినీతి ఆరోపణలపై విచారణ చేయాలని ఆందోళన

కడప విద్య, న్యూస్‌టుడే : ఇంటర్మీడియట్ కడప ప్రాంతీయ సంయుక్త సంచాలకులు (ఆర్జేడీ)పై వస్తున్న అవినీతి ఆరోపణలపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని, రెగ్యులర్ ఆర్జేడీ ని నియమించాలని ఏఐఎస్‌బీ జిల్లా కన్వీనర్ సగిలి రాజేంద్రప్రసాద్ డిమాండ్‌చేశారు. స్థానిక ఆర్జేడీ కార్యాలయం ఎదుట మంగళవారం సంఘం ధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అక్రమాలపై ఉన్నతాధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. నాయకులు అజ్మతుల్లా, చరణ్, ఫయాజ్ పాల్గొన్నారు.

ముందస్తు జాగ్రత్తలతో పంటలకు రక్ష

రైతులకు శాస్త్రవేత్తల సూచనలు


వల్లూరులో నేలవాలిన వరిపంటను చూపుతున్న రైతు

చింతకొమ్మదిన్నె, న్యూస్‌టుడే : జిల్లాలో తుపాను కారణంగా నాలుగు రోజుల పాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. ఈ నేపథ్యంలో సాగులో ఉన్న పంటలు దెబ్బతినే అవకాశం ఉంది. జిల్లాలో ఇప్పటి వరకు సరైన వర్షాలు లేకపోవడంతో ఈ వర్షంతో పంటలకు మేలు జరిగినా పురుగులు, తెగుళ్ల ఆశించి నష్టం వాటిల్లే పరిస్థితులు కూడా ఉన్నాయని వ్యవసాయ శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. ముందస్తు జాగ్రత్తలు పాటించి వర్షాల తరువాత సస్యరక్షణ చర్యలు చేపడితే పంటలను కాపాడుకోవచ్చని కలికిరి కృషి విజ్ఞాన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త, సమన్వయకర్త కె.మంజుల, సీకేదిన్నె కృషి విజ్ఞాన కేంద్రం సమన్వయకర్త వీరయ్య, ఊటుకూరు వ్యవసాయ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త సునీల్ కుమార్, ఏరువాక కేంద్రం సమన్వయకర్త అంకయ్య కుమార్ సూచిస్తున్నారు.


వర్షాల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు

అధిక వర్షాలతో తోటల్లో నీరు నిల్వ ఉండడంతో వేర్లు కుళ్లిపోయి పంట దెబ్బతింటుంది. సాగులో ఉన్న పంటల్లో రైతులు నీటి నిల్వ లేకుండా చర్యలు చేపట్టాలి. వర్షాలకు విద్యుత్తు తీగలు కిందపడి ఉండడంతో రైతులు విద్యుదాఘాతానికి గురై ప్రమాదాల బారినపడుతుంటారు. పగటి వేళల్లోనే పొలాలకు వెళ్లి నీటి నిల్వలను తొలగించడం, కాలువలు తీసి నీటిని బయటకు పంపే చర్యలు చేపట్టాలి. జిల్లాలో వరి, వేరుసెనగ, పసుపు, చామంతి, మినుము, మొక్కజొన్న, అరటి, బొప్పాయి, తమలపాకుల తోటలు, కంది, ఆముదం, ఉల్లి తదితర పంటలు సాగులో ఉన్నాయి. అధిక వర్షాలతో వివిధ రకాల తెగుళ్లు, పురుగులు ఆశించే అవకాశం ఉంది. వీటి నివారణ చర్యలు చేపడితే పంటలను కాపాడుకోవచ్చు.

వరి నారుమడిలో సస్యరక్షణ

అధిక వర్షాలతో వరి నారుమడిలో ఆకుముడత, కాండం తొలిచే పురుగు, ఉల్లికోడు పురుగు ఆశించే అవకాశం ఉంది. 21 రోజుల సెంటు నారుమడిలో 160 గ్రాముల గులికలు పలుచగా చల్లుకోవాలి. వరినాటు వేసే సమయానికి ఈ మూడు తెగుళ్లను


వీరయ్య


సునీల్‌కుమార్


అంకయ్యకుమార్

నివారించుకోవచ్చు. జిల్లాలో కేసీ కాలువతో పాటు ఇతర ప్రాంతాల్లో కూడా రైతులు వరి సాగు చేస్తున్నారు. కొంత మంది ఇప్పటికే బోరుబావుల కింద ఉన్న నీటితో సాగు చేశారు. అయితే వరి పంటలో ప్రస్తుత వర్షాలకు కాండం తొలిచే పురుగు, ఆకుముడత పురుగు ఎక్కువగా ఆశించే అవకాశం ఉంది. వీటి నివారణకు ఫ్లుబెండోమైడ్ 0.25ఎంఎల్ ఒక లీటరు నీటికి లేదా కోరాజిన్ 0.3ఎంఎల్ ఒక లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. బ్యాక్టీరియా ఎండు తెగులు నివారణకు నత్రజని ఎరువులను వాయిదా వేసుకొని మ్యూరేట్ ఆఫ్ పొటాష్ ఎకరాకు 20 కిలోల చొప్పున పంటలో నీరు తగ్గిన తర్వాత పలుచగా నీరు ఉన్న సమయంలో వేయాలి.

చామంతిలో : జిల్లాలో సీకేదిన్నె, పెండ్లిమర్రి, వేంపల్లె, ఖాజీపేట, దువ్వూరు, వీఎన్ పల్లె, వేముల ప్రాంతాల్లో చామంతి తోటలను అధికంగా సాగు చేస్తున్నారు. అధిక వర్షాలు పడిన సమయంలో ఇందులో వేరు కుళ్లు ఆకుమచ్చ తెగులు ఆశించి పంటను పూర్తిగా నష్టపరుస్తాయి. వర్షాలు ఎక్కువగా కురిసిన సమయంలో పంటలో నీరు నిల్వ ఉండకుండా బయటకు తొలగించాలి. లేదంటే నీరు మొక్కల వద్దనే నిల్వ ఉండి మొక్కలు కుళ్లిపోతాయి. చామంతిలో వేరు కుళ్లు నివారణకు కాపర్ ఆక్సిక్ క్లోరైడ్ 3 గ్రాములు ఒక లీటరు నీటికి లేదా విడోమిల్ ఎంజడ్ 2.5 గ్రాములు ఒక లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. అలాగే ఆకు మచ్చ తెగులు నివారణకు కార్బన్ డిజిమ్ ఒక గ్రాము ప్లస్ మ్యాంకోజెబ్ 2.5 గ్రాములు ఒక లీటరుకు లేదా హెక్సాకోనోజోల్ 2ఎంఎల్ ఒక లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

వేరుసెనగ పంట : వేరుసెనగ పంటకు టిక్కా ఆకుమచ్చ తెగులు ఆశించే అవకాశం ఉంది. దీని నివారణకు హెక్సాకోనోజోల్ 2ఎంఎల్ లీటరు నీటికి పిచికారీ చేయాలి. రసం పీల్చు పురుగుల నివారణకు ఇమిడాక్లోప్రిడ్ 0.4ఎంఎల్ లీటరు నీటి పిచికారీ చేయాలి.

పత్తి పంటలో : పత్తి పంటకు ఈ వర్షాల వల్ల గులాబి రంగు పురుగు ఆశించవచ్చు. పూత, పిందె దశలో ఉన్నట్లయితే 5 శాతం వేపగింజల కషాయం కానీ లేక 5మి.లీ వేప నూనె ఒక లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకుంటే పత్తి పంటలో గులాబీ రంగు రెక్కల పురుగులు గుడ్లు పెట్టకుండా నివారించవచ్చని తెలిపారు.

పాఠశాల పక్కన మద్యం దుకాణం వద్దు



కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న ప్రొద్దుటూరు వాసులతో సీపీఐ జిల్లా కార్యదర్శి చంద్ర

జిల్లా సచివాలయం, న్యూస్‌టుడే: ప్రొద్దుటూరులోని వసంతపేటలో పాఠశాల, గుడిపక్కనే మద్యం దుకాణం ఏర్పాటు చేసేందుకు కొందరు ప్రయత్నిస్తున్నారని, ప్రశ్నించిన స్థానికులను బెదిరిస్తున్నారని సీపీఐ జిల్లా కార్యదర్శి గాలిచంద్ర ఆరోపించారు. ప్రొద్దుటూరుకు చెందిన పలువురు మహిళలు, స్థానికులు, సీపీఐ నాయకులు మంగళవారం కడప కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేశారు. అనంతరం జాయింట్ కలెక్టర్ అదితిసింగ్‌కు వినతి పత్రం అందించి సమస్యలను వివరించారు. గాలిచంద్ర మాట్లాడుతూ గుడి, బడికి వంద మీటర్ల దూరం అవతల మద్యం దుకాణం ఏర్పాటు చేయాలని నిబంధనలున్నా, ప్రొద్దుటూరు పట్టణంలోని వసంతపేట, సాయిబాబా కొట్టాలులో పది అడుగుల దూరంలోనే ఉందని చెప్పారు. వైకాపా పాలనలో కూడా ఇక్కడే దుకాణం ఏర్పాటు చేస్తే ఉద్యమంతో అక్కడి నుంచి తరలించామని తెలిపారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోకుంటే మళ్లీ ఆందోళనలు తప్పవని హెచ్చరించారు. కేసీబాదుల్లా, గంగాసురేష్, వెంకటసుబ్బయ్య, వెంకటసుబ్బయ్య, శ్రీనివాసులు, శ్రీనివాసులురెడ్డి, సుధాకర్ తదితరులున్నారు.

గుప్తనిధులకు తవ్వకాలు

సిద్దవటం, న్యూస్‌టుడే : సిద్దవటంలోని రంగనాయక స్వామి కోవెలలో గుప్తనిధి కోసం నిర్మాణాన్ని పగలగొట్టిన ఘటన వెలుగులోకి వచ్చింది. ఇక్కడి మూలవిరాట్‌ను గతంలో దుండగులు ధ్వంసం చేయడంతో కొన్నేళ్లుగా ఆలయం మూతపడి ఉంది. ఇటీవల కొందరు గుప్తనిధి కోసం కోవెలలోకి వెళ్లి ప్రధాన గుడికి ఎదురుగా గరుత్మంతుని గుడిపై ఉన్న రాతి మొగ్గను పగులగొట్టారు. మంగళవారం ఈ విషయం బయటపడింది. ఈ సంఘటనపై ఫిర్యాదు రాలేదని ఎస్సై చిరంజీవి తెలిపారు.



వినియోగదారునికి నాణేలు అందజేస్తున్న ఏపీజీబీ బ్యాంకు అధికారులు

రూ.10 నాణేల చెల్లుబాటుపై అపోహలొద్దు

కడప ఏడురోడ్లు, న్యూస్‌టుడే : రూ.10 నాణేల చెల్లుబాటుపై ఎటువంటి అపోహలొద్దని, వాటిని నిరభ్యతరంగా తీసుకోవచ్చని ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు కరెన్సీ చెస్ట్ మేనేజరు గోపిరెడ్డి అన్నారు. దీనిపై ఏపీజీబీ అధికారులు, ఉద్యోగులు ప్రచార కార్యక్రమంతో పాటు మేళాను మంగళవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నాణేలు ఎవరైనా తీసుకోకపోతే చట్టపరంగా చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ సందర్భంగా కావాల్సిన వారికి రూ.10 నాణేలు అందజేశారు. ఏపీజీబీ సీనియర్ మేనేజర్లు చిరంజీవి, ప్రశాంత్, కరెన్సీ చెస్ట్ సిబ్బంది నవీన్, సందాని భాషా, బ్యాంకు సిబ్బంది, ఖాతాదారులు పాల్గొన్నారు.

జిల్లా అభివృద్ధిపై 17, 18 తేదీల్లో సీఎంతో సమావేశం

- కొప్పర్తిలోనే ఎంఎస్‌ఎంఈ కేంద్రం
- జిల్లా తెదేపా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాధవి, పక్కన తెదేపా జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి

అరవిందనగర్ (కడప), న్యూస్‌టుడే: 'జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు చర్యలు చేపట్టాం. దీనిపై జిల్లాలోని ఐదుగురు ఎమ్మెల్యేలు, ఇద్దరు నియోజకవర్గ ఇన్‌ఛార్జులతో ఈ నెల 17, 18 తేదీల్లో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సమావేశం కానున్నారు. ఉక్కు పరిశ్రమ ఏర్పాటుకు జిందాల్ సంస్థతో కూడా సీఎం మాట్లాడారు. రానున్న నాలుగున్నరేళ్ల కాలంలో కడప జిల్లా ప్రగతిని అందరూ కళ్లారా చూస్తారు.' అని తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. కడపలో మంగళవారం ఆయన మాట్లాడుతూ జిల్లాకు చెందిన వారు ఇద్దరు ముఖ్యమంత్రులుగా పనిచేసినా కడపను నిర్లక్ష్యం చేశారని ఆరోపించారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో జిల్లాలో నీటిపారుదల, రహదారులు, రైల్వే, పరిశ్రమల రంగాలపై ప్రత్యేక ప్రణాళికలు రూపొందించామన్నారు. కేంద్ర ప్రభుత్వం కొప్పర్తి పారిశ్రామిక వాడకు ప్రత్యేక నిధులు కేటాయించిందని, ఇదంతా చంద్రబాబు చలువేనన్నారు. ఇక్కడ నుంచి ఎంఎస్‌ఎంఈ కేంద్రం ఎక్కడికీ తరలిపోలేదని, త్వరలోనే ప్రారంభోత్సవం చేస్తామని స్పష్టం చేశారు. వైకాపా చేసిన అరాచకాలు, మాఫియాను సరిచేసేందుకు కాసింత సమయం పట్టిందని, ఈ నేపథ్యంలో ఉచిత ఇసుక సరఫరాలో జాప్యం జరిగిందని, త్వరలోనే అన్నీ సక్రమంగా సాగుతాయన్నారు. దీపావళికి మూడు ఉచిత సిలిండర్లతో పాటు, ఇతర పథకాల అమలుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని వెల్లడించారు.

కడపలో నీటి ఎద్దడికి శాశ్వత పరిష్కారం

కడప నగరంలో నెలకొన్న నీటి ఎద్దడికి త్వరలోనే శాశ్వత పరిష్కారం చూపుతామని ఎమ్మెల్యే మాధవి స్పష్టం చేశారు. ఎప్పుడో స్వాతంత్ర్యం రాక ముందు ఏర్పాటు చేసిన యంత్రాలే నేటికీ గండివాటర్‌వర్క్స్‌లో ఉన్నాయన్నారు. ఈ నేపథ్యంలో ప్రత్యేక వాటర్ పార్కు ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపామని తెలిపారు. 22 డ్రెయిన్ నిర్మాణాలను పూర్తి చేస్తామని చెప్పారు. టిడ్కో ఇళ్లకు సంబంధించి సీఎం దృష్టికి తీసుకెళ్లి త్వరలోనే లబ్ధిదారులకు అందిస్తామన్నారు. షహమీరియా దర్గా, లా కళాశాల వద్ద వంతెనల నిర్మాణానికి పునఃప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపుతున్నట్లు వివరించారు. కడప నగరం అభివృద్ధే తమ లక్ష్యమని చెప్పారు.

బాధితులకు అండగా నిలవాలి: ఎస్పీ

కమలాపురం, న్యూస్‌టుడే : స్టేషన్‌కు వచ్చిన ఫిర్యాదుదారులతో బాగా మాట్లాడటం, వారి సమస్యలను సావధానంగా వినడం, సానుకూలంగా స్పందించి సేవలు అందించడంతో పాటు కష్టాల్లో ఉన్న వారికి పోలీస్ శాఖ అండగా ఉండాలని జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు అన్నారు. ఆయన మంగళవారం స్థానిక పోలీస్ స్టేషన్‌ను డీఎస్పీ వెంకటేశ్వర్లతో కలిసి పరిశీలించారు. ఎస్పీ మాట్లాడుతూ రోడ్లపై విచ్చలవిడిగా మద్యం తాగి సామాన్యులను ఇబ్బంది పెట్టడం, అక్కడకక్కడ గంజాయి తాగే వారితో సమస్య ఉందని చెప్పారు. కమలాపురంలో వాటికి సంబంధించిన 12 ప్రదేశాలు గుర్తించి 8 ప్రదేశాలను శుభ్రం చేయించామని పేర్కొన్నారు. సీఐ రోశన్, ఎస్సై ప్రతాప్‌రెడ్డి, పాల్గొన్నారు.


పోలీస్ స్టేషన్‌ను పరిశీలిస్తున్న ఎస్పీ హర్షవర్ధన్‌రాజు

మొదటి విడత వాయిదాతో రూ.14.4 కోట్ల ఆదాయం

కడప నేరవార్తలు, న్యూస్‌టుడే: జిల్లాలో 2024-26కు సంబంధించి సోమవారం 139 మద్యం దుకాణాలకు లాటరీ తీశారు. వాటిని దక్కించుకున్న వారు నిర్ణీత ఫీజులో మొదటి విడత వాయిదాను చెల్లించడంతో ప్రభుత్వానికి రూ.14.4 కోట్ల ఆదాయం వచ్చింది. జిల్లాలో 10 వేల నుంచి 50 వేల లోపు ఉన్న దుకాణాలకు ఏడాదికి రూ.55 లక్షలు, 50 వేల నుంచి 5 లక్షల్లోపు ఉన్న దుకాణాలకు రూ.65 లక్షలు ఫీజుగా నిర్ణయించారు. దీనిని ఆరు విడతల్లో చెల్లించాలి. దుకాణం దక్కించుకున్న వారు వెంటనే అక్కడిక్కడే లైసెన్సు ఫీజులో మొదటి కంతు చెల్లించడంతో ప్రభుత్వానికి రూ.14.4 కోట్లు వచ్చింది. వారందరికి అప్పటికప్పుడు తాత్కాలిక లైసెన్సు ఇచ్చారు. కొద్ది రోజుల తరువాత రెగ్యులర్ లైసెన్సు జారీ చేస్తారు.

జాతీయ స్థాయి పోటీలకు జిల్లా విద్యార్థులు

కడప క్రీడలు, న్యూస్‌టుడే: ఈ నెల 16 నుంచి 18వ తేదీ వరకు తమిళనాడులోని కోయంబత్తూరులో జరిగే జాతీయ స్థాయి అండర్-17 ఖేలో ఇండియా సౌత్‌జోన్ ఖోఖో ఛాంపియన్‌షిప్ పోటీలకు చింతకొమ్మదిన్నె మండలం బయనపల్లె గ్రామంలోని శ్రీవెంకటేశ్వర ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు టి.సుస్మిత, స్రవంతి పోటీలకు ఎంపికయ్యారు. వారిని జిల్లా ఖోఖో సంఘం అధ్యక్షుడు డాక్టర్ కె.రామసుబ్బారెడ్డి, కార్యదర్శి నరేంద్ర, వ్యాయామ పాధ్యాయుడు పవన్‌కుమార్ అభినందించారు.


టి.సుస్మిత...


స్రవంతి

ముగిసిన జిల్లా స్థాయి బ్యాడ్మింటన్ ఎంపికలు


రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన బ్యాడ్మింటన్ క్రీడాకారులు

కడప క్రీడలు, న్యూస్‌టుడే: జిల్లా ఎస్‌జీఎఫ్ఐ ఆధ్వర్యంలో కడప నగరంలోని డీఎస్ఏ ఇండోర్ స్టేడియంలో జరిగిన జిల్లా స్థాయి బ్యాడ్మింటన్ ఎంపికలు మంగళవారం ముగిశాయి. జిల్లా ఎస్‌జీఎఫ్ కార్యదర్శి బి.అరుణకుమారి, సీనియర్ వ్యాయామ ఉపాధ్యాయులు క్రీడాకారులను పరిచయం చేసుకొని పోటీలను ప్రారంభించారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులు: అండర్-14 విభాగంలో ఎం.ఆదిత్య, ఏఎస్.ఆదినారాయణరెడ్డి, సీవీ గీతేష్‌రెడ్డి, డి.ఈశ్వర్, పి.ప్రాన్షు, ఎల్.పూర్వజ, బి.హరిణిలో హితాబాయ్, కె.హృతికి, ఎస్.శృతిక, వి.శ్రీకావ్య, అండర్-17 విభాగంలో ఎల్.సుప్రిత్‌రెడ్డి, ఎన్.ఫాజిల్‌సాహెబ్, సి.విశ్వతేజ, సి.త్రివిక్రమ్, జి.నాగజతేశ్వర్, జి.శ్రీవల్లి, జేఎం.గీతిక, ఎం.కళ్యాణి, కె.ప్రణవి, వై.చెర్షిత ఎంపికయ్యారు.

ఉత్సాహంగా వెయిట్‌లిఫ్టింగ్ పోటీలు : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో కడప నగర శివారులోని రాష్ట్ర క్రీడాపాఠశాలలో జరిగిన అండర్-17 జిల్లా స్థాయి వెయిట్‌లిఫ్టింగ్ పోటీలు ఉత్సాహంగా సాగాయి. క్రీడా పాఠశాల ఎస్‌వో జనర్దనరెడ్డి, జిల్లా ఎస్‌జీఎఫ్ కార్యదర్శి అరుణ క్రీడాకారులను పరిచయం చేసుకొని పోటీలను ప్రారంభించారు. బాలుర విభాగంలో ఎస్.అర్షద్, వైవీఎన్ శివపవన్, ఎన్.అబ్దుల్‌రహమాన్, జె.అశోక్, జి.విష్ణు, కిరణ్‌కుమార్‌రెడ్డి, బాలికల విభాగంలో బి.శ్రీచందన, బి.గీతారాణి, లెనిన్‌ప్రియ, రాజ్యలక్ష్మీ, శ్రీవెన్నల, సత్యవతి ఎంపికయ్యారు.

రేపు జిల్లా స్థాయి జూనియర్స్ ఖోఖో పోటీలు

కడప క్రీడలు, న్యూస్‌టుడే: ఉమ్మడి జిల్లాల ఖోఖో సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 17నఉదయం 11 గంటలకు చింతకొమ్మదిన్నె మండలం బయనపల్లె శ్రీ వెంకటేశ్వర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో జిల్లా స్థాయి బాలబాలికల జూనియర్స్ ఖోఖో జట్టు ఎంపికలు నిర్వహిస్తున్నట్లు సంఘం అధ్యక్ష, కార్యదర్శులు కె.రామసుబ్బారెడ్డి, జె.నరేంద్ర ప్రకటనలో పేర్కొన్నారు. 2006, నవంబరు 21 తర్వాత జన్మించిన వారు అర్హులని, క్రీడాకారులు ఎత్తు, బరువు, వయస్సు మూడు కలిపితే 250 పాయింట్ల లోపు ఉండాలని సూచించారు. ఇతర వివరాలకు 9849713690 నెంబరులో సంప్రదించాలన్నారు.


చెక్కు అందజేస్తున్న ఏఎస్పీ ప్రకాష్‌బాబు

ఏఎస్సై కుటుంబానికి రూ.2.50 లక్షల సాయం

కడప నేరవార్తలు, న్యూస్‌టుడే: బద్వేలు గ్రామీణ ఠాణాలో ఏఎస్సైగా విధులు నిర్వహిస్తూ అనారోగ్యంతో మృతి చెందిన ఆర్.అన్వర్ కుటుంబానికి పోలీస్ శాఖ తరఫున రూ.2.5 లక్షల చెక్కును జిల్లా అదనపు ఎస్పీ(పరిపాలన) కె.ప్రకాష్ బాబు మంగళవారం తన కార్యాలయంలో అందజేశారు. ఏఎస్సై కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకుంటామని చెప్పారు. ఎలాంటి సమస్యలున్నా తమ దృష్టికి తీసుకుని రావాలన్నారు.

ఉప కులపతి రాజీనామా చేయాలి

మారుతీనగర్, న్యూస్‌టుడే: వివిధ ఆరోపణలు ఎదుర్కొంటున్న యోగి వేమన విశ్వవిద్యాలయ బాధ్య ఉప కులపతి కృష్ణారెడ్డి వెంటనే రాజీనామా చేయాలని, లేని పక్షంలో విశ్వవిద్యాలయం ముట్టడి చేస్తామని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి గంగాసురేష్, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి వలరాజు డిమాండు చేశారు. స్థానిక జిల్లా కార్యాలయంలో మంగళవారం వారు మాట్లాడారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు శివశంకర్, నగర కార్యదర్శి తేజ, ఉపాధ్యక్షుడు చంద్ర పాల్గొన్నారు.

గుండెపోటుతో ఒప్పంద ఉద్యోగి మరణం



ప్రొద్దుటూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: ప్రొద్దుటూరు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో కాంట్రాక్టు వర్క్‌షాప్ అటెండరుగా పని చేస్తున్న **ఉమా మల్లికార్జున దేవరాయ** (52) గుండెపోటుతో మృతిచెందారు. కుటుంబ సభ్యులు, స్థానికుల వివరాల ప్రకారం.. పట్టణంలోని సూపర్‌బజార్ రోడ్డుకు చెందిన ఉమా మల్లికార్జున దేవరాయ 18 ఏళ్లుగా పాలిటెక్నిక్ కళాశాలలో పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. ఆయనకు భార్య, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులరైజ్ చేసేందుకు గత వైకాపా ప్రభుత్వం జీవోను తీసుకువచ్చింది. ఆ సమయంలో తనకు అన్ని అర్హతలున్నా సర్వీసు రెగ్యులరైజ్ కాలేదని ఆయన నిత్యం బాధపడుతుండేవారు. ఈ క్రమంలోనే ఈ నెల 13న గుండెపోటుకు గురయ్యారు. కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ సోమవారం రాత్రి చనిపోయారు. సర్వీసు క్రమబద్ధీరణ విషయంలో అధికారుల మధ్య సమన్వయం లోపంతో కొందరికి మాత్రమే రెగ్యులరైజేషన్ చేసి మిగిలిన వారిని పట్టించుకోలేదని చెబుతున్నారు. కుటుంబ పెద్దను కోల్పోవడంతో భార్య, కుమార్తెలు కన్నీరుమున్నీరయ్యారు. ఇక తమకు దిక్కెవరంటూ రోదించడం పలువురిని కంటతడి పెట్టించింది. ప్రభుత్వం ఆదుకుని అండగా నిలవాలని కాంట్రాక్టు ఉద్యోగి కుటుంబ సభ్యులు, తోటి ఉద్యోగులు వేడుకుంటున్నారు. విషయం తెలుసుకున్న కళాశాల ప్రిన్సిపల్, అధ్యాపకులు కుటుంబ సభ్యులతో మాట్లాడి ధైర్యం చెప్పారు.

పాఠశాల బస్సుకు తప్పిన ప్రమాదం


లోయ పక్కన నిలిచిన బస్సు

సిద్దవటం, న్యూస్‌టుడే : మండలంలోని టక్కోలు బండికనుమ మలుపులో మంగళవారం సాయంత్రం ఒక ప్రైవేటు పాఠశాల బస్సుకు త్రుటిలో ప్రమాదం తప్పింది. కడపలోని ఒక ప్రైవేటు పాఠశాలకు చెందిన బస్సు మంగళవారం సాయంత్రం 30 మంది విద్యార్థులతో సిద్దవటం మండలంలోని మాచుపల్లెకు బయలుదేరింది. టక్కోలు గ్రామ పరిధిలోని బండి కనుమ మలుపు వద్ద తిరగలేక అదుపు తప్పింది. చోదకుడు అప్రమత్తంగా వ్యవహరించి బస్సు లోయలో పడకుండా పక్కనే ఖాళీగా ఉన్న ముళ్ల పొదల్లోకి తిప్పి నిలిపేశారు. విద్యార్థులకు ఎటువంటి ప్రమాదం జరగకపోవడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు. సమాచారం తెలుసుకున్న పిల్లల తల్లిదండ్రులు, పరిసర గ్రామాల ప్రజలు ఘటనాస్థలానికి చేరుకున్నారు. ఎస్సై చిరంజీవి ఘటనా స్థలాన్ని పరిశీలించారు.

కువైట్‌లో జిల్లా వాసి మృతి: 45 రోజులకు స్వగ్రామానికి మృతదేహం



చింతకొమ్మదిన్నె, న్యూస్‌టుడే: కువైట్‌లో గత నెల 1న మృతి చెందిన సీకేదిన్నె మండలం బుగ్గలేటిపల్లెకు చెందిన **ఉప్పు నాగేంద్ర (42)** మృతదేహం ఎట్టకేలకు 45 రోజుల తర్వాత స్వగ్రామానికి చేరుకుంది. ఉపాధి కోసం వెళ్లి, విగత జీవిగా తిరిగొచ్చిన నాగేంద్రను చూసి భార్య, ముగ్గురు పిల్లలు, కుటుంబసభ్యులు బోరున విలపించారు. బంధువుల కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి... గ్రామానికి చెందిన నాగేంద్ర రెండేళ్ల కిందట ఉపాధి నిమిత్తం కువైట్ వెళ్లారు. అప్పటి నుంచి రోజు ఇంటికి ఫోన్ చేసి భార్య, పిల్లలతో మాట్లాడేవారు. ఆగస్టు 30న మాట్లాడిన తర్వాత అతని ఫోన్ పనిచేయలేదు. దీంతో కుటుంబ సభ్యులు కువైట్‌లోని తెలిసిన వారికి ఫోన్ చేసి, నాగేంద్ర వివరాల కోసం విచారించారు. అతను కనిపించలేదని సమాచారం రావడంతో ఆందోళన చెందారు. భార్య సరోజ తన భర్త ఆచూకీ తెలపాలని కలెక్టర్, ఎస్పీ, ఎమ్మెల్యే కృష్ణచైతన్యరెడ్డిలకు విన్నవించారు. తర్వాత నాగేంద్ర మృతి చెందినట్లు భారత రాయబార కార్యాలయం నుంచి సమాచారం అందింది. మృతిపై దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు. విచారణ అనంతరం అతను గుండెపోటుతో మృతి చెందినట్లు తేలింది. దీనిపై కుటుంబ సభ్యులు మాత్రం అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ప్రక్రియ అంతా పూర్తికావడానికి ఇన్నిరోజుల సమయం పట్టింది. మృతదేహాన్ని తీసుకొచ్చేందుకు కలెక్టర్ లోతేటి శివశంకర్, ఎస్పీ హర్షవర్ధన్‌రాజు, కమలాపురం ఎమ్మెల్యే కృష్ణచైతన్యరెడ్డి, తెదేపా రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి కృషి చేశారని కుటుంబ సభ్యులు తెలిపారు. ప్రభుత్వం తమ కుటుంబాన్ని ఆదుకోవాలని నాగేంద్ర భార్య సరోజ విన్నవించారు.

దుకాణంలోకి దూసుకెళ్లిన లారీ


లారీ ఢీకొనడంతో విరిగిన విద్యుత్తు స్తంభం

ముద్దనూరు, న్యూస్‌టుడే: ముద్దనూరు రైల్వే గేట్ వద్ద కార్బన్‌పౌడర్‌తో వెళ్తున్న లారీ ఒక దుకాణంలోకి దూసుకెళ్లిన సంఘటన మంగళవారం చోటుచేసుకుంది. అదృష్టవశాత్తు ఆ సమయంలో దుకాణం మూసివేసి ఉండడంతో అక్కడ ప్రజలెవరూ లేరు. జమ్మలమడుగు వైపు నుంచి కార్బన్‌పౌడర్ పౌడర్‌తో వస్తున్న లారీ అదుపుతప్పి ఎదురుగా ఉన్న విద్యుత్తు స్తంభాలను, ఒక కారు, ఆటోను ఢీకొని పక్కనే ఉన్న దుకాణంలోకి దూసుకుపోయింది. అక్కడ ఆ సమయంలో జన సమూహం లేక పోవడంతో పెను ప్రమాదం తప్పినట్లు స్థానికులు తెలిపారు. విద్యుత్తు తీగలు తెగిపోవడంతో విద్యుత్తు సరఫరాకు అంతరాయం ఏర్పడింది. గతంలో సుమారు 5 నెలల క్రితం ఒక నివాస గృహంలోకి లారీ దూసుకెళ్లింది. వరుస సంఘటనల నేపథ్యంలో ముద్దనూరు ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు.

అడవిలో మేకల కాపరి అదృశ్యం



అట్లూరు, న్యూస్‌టుడే : మండలంలోని కలవాండ్లపల్లెకు చెందిన మేకల కాపరి **సొంట గంగిరెడ్డి** సోమవారం నుంచి అదృశ్యమయ్యారు. స్థానికుల వివరాల మేరకు.. గంగిరెడ్డి సోమవారం మేకలను లంకమల అభయారణ్యం వైపు మేతకోసం తోలుకెళ్లారు. మధ్యాహ్నం భోజనానికి ఇంటికొచ్చే వ్యక్తి రాత్రయినా రాకపోవడంతో కుటుంబికులు సమీప పొలాలు, చెరువుల్లో జల్లెడ పట్టినా ఫలితం లేదు. మంగళవారం కూడా ఇల్లు చేరలేదు. దీంతో బంధువులు, గ్రామస్థులు సోమశిల వెనుక జలాల ప్రాంతాలు, అభయారణ్యంలోను కలియదిరిగారు. మంగళవారం రాత్రి మేకలు ఇంటికి చేరుకున్నాయి గాని గంగిరెడ్డి రాలేదు. భార్య ఓబులమ్మ, కుమారుడు సుదర్శన్ విలపిస్తూ తండ్రి కోసం వెతుకుతున్నారు. పోలీసులు, అటవీ అధికారులు స్పందించి డ్రోన్ ద్వారా వెతికే ప్రయత్నం చేయాలని కుటుంబికులు కోరుతున్నారు.

ప్రైవేట్ ట్రావెల్స్ దోపిడీని అరికట్టాలి


మారుతీనగర్, న్యూస్‌టుడే: ప్రజల అవసరాలను ఆసరాగా తీసుకుని, దోపిడీ చేస్తున్న ప్రైవేట్ ట్రావెల్స్ యాజమాన్యాలపై చర్యలు చేపట్టాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి శివకుమార్ తెలిపారు. స్థానిక జిల్లా కార్యాలయంలో మంగళవారం మాట్లాడుతూ అధిక ఛార్జీలు వసూలు చేస్తున్నా, సంబంధిత అధికారులు నిమ్మకు నీరెత్తినట్టుగా వ్యవహరించడం బాధాకరమన్నారు. సాధారణ ఛార్జీల కంటే అయిదు రెట్లు అధికంగా వసూలు చేస్తున్నారని, ఇప్పటికైనా స్పెషల్ డ్రైవ్ నిర్వహించి, కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

దెబ్బతిన్న పొలాల పరిశీలన

వల్లూరు, న్యూస్‌టుడే: అల్పపీడన ప్రభావంతో రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో కోతకొచ్చిన వరిపంట పొలాలు నేలకొరిగాయి. తప్పెట్ల చెరువుకిందపల్లె బాలుగారిపల్లె పొలాలను మంగళవారం జిల్లా వ్యవసాయాధికారి నాగేశ్వరరావు పరిశీలించారు. పొలంలో నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఏవో సాయిజ్యోతి, సహాయకురాలు సురేఖ పాల్గొన్నారు.


బాలుగారిపల్లె వద్ద నేలకొరిగిన పొలం వద్ద రైతు సంజీవరెడ్డికి సూచనలు ఇస్తున్న నాగేశ్వర్‌రావు

ముళ్లపొదల్లో రైల్వే ఆవాసాలు



ప్రొద్దుటూరు రైల్వే స్టేషన్‌కు సంబంధించి ఉద్యోగుల ఇళ్లు ముళ్లకంపలతో అధ్వానంగా ఉన్నాయి. రూ.కోట్లు వెచ్చించి ఇళ్లు నిర్మించినా ఉద్యోగులెవరూ చేరకపోవడంతో ఎనిమిదేళ్లుగా నిరుపయోగంగా మారాయి. పిచ్చిమొక్కలు, ముళ్లపొదలు దట్టంగా పెరిగాయి. దీనిపై ప్రొద్దుటూరు స్టేషన్ మాస్టర్‌ను 'న్యూస్‌టుడే' వివరణ కోరగా ఉద్యోగులెవరూ ఇందులో చేరలేదన్నారు. తదుపరి ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామన్నారు.

- ఈనాడు, కడప, -న్యూస్‌టుడే, ప్రొద్దుటూరు

ప్రొద్దుటూరు

• ప్రొద్దుటూరు • జమ్మలమడుగు • బద్వేలు • మైదుకూరు

చెత్తనిల్వ కేంద్రం నిరుపయోగం



పల్లెల్లో పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించి చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను అప్పట్లో తెదేపా ప్రభుత్వం ఏర్పాటు చేసింది. వీటిని గత వైకాపా ప్రభుత్వం నిర్లక్ష్యం చేసింది. దాంతో కేంద్రాలన్నీ నిరుపయోగంగా ఉన్నాయి. ప్రొద్దుటూరు మండలం చౌటపల్లెకు చెందిన చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని శ్మశానంలో ఏర్పాటు చేశారు. దీనికి రూ.7 లక్షలు వ్యయం చేసినా నిర్వహణ లేకపోవడంతో ముళ్లకంపల మధ్య అధ్వానంగా మారింది. దీనిపై పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించి చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో సూర్యనారాయణరెడ్డి తెలిపారు.

- ఈనాడు కడప, - న్యూస్‌టుడే, ప్రొద్దుటూరు

మేమున్నాం... మీకు తోడుగా... (10 AM to 1 PM)
ప్రొద్దుటూరు : 9966349431
జమ్మలమడుగు : 9000409516
మైదుకూరు : 8008573447
బద్వేలు గ్రామీణ : 8008573493

స్పందనకు వందనం

జమ్మలమడుగు గ్రామీణ: మండలంలోని గూడెంచెరువు గ్రామ పరిధిలోని రాజీవ్‌నగర్ కాలనీలో రహదారులపై మురుగు నిల్వ చేరి పారిశుద్ధ్యం అధ్వానంగా ఉండేది. ఈ విషయంపై ప్రచురితమైన అంశాలపై అధికారులు స్పందించి చర్యలు చేపట్టారు. ఇందుకు స్పందించిన పంచాయతీ కార్యదర్శి సంజీవ్‌రెడ్డి పారిశుద్ధ్య చర్యలు చేపట్టి, దోమల నివారణకు బ్లీచింగ్ పౌడర్ చల్లించారు.

జమ్మలమడుగు గ్రామీణ: మండల పరిధిలోని సిరిగేపల్లె గ్రామంలోని ప్రధాన రహదారులపై చెత్తచెదారం నిల్వతో దుర్వాసన వ్యాపించేది. ఈ సమస్యపై వచ్చిన కథనంపై స్పందించిన పంచాయతీ కార్యదర్శి గంగన్న రహదారిపై నిల్వ ఉన్న చెత్తచెదారం తొలగించి సమస్యను పరిష్కరించారు.

?: ప్రొద్దుటూరు మండలం సోములవారిపల్లె పంచాయతీ నాగేంద్రనగర్ సాయిబాబా ఆలయానికి వెళ్లే సిమెంటు రహదారికి మధ్యలో ఖాళీ స్థలాలు ఉండడం, కొన్ని చోట్ల గుంతల వల్ల రాత్రి వేళ వాహనదారులు, పాదచారులు ప్రమాదానికి గురవుతున్నారు. ఈ గుంతలను పూడ్చి ప్రమాదాలను పంచాయతీ అధికారులు నివారించాలి. **-రమేష్‌బాబు, స్థానికుడు**

✓: రోడ్డుకు మధ్యలో ఉన్న ఖాళీ స్థలాల వల్ల ప్రమాదాలు జరుగుతున్నట్లు నాకు సమాచారం వచ్చింది. ఆయా ప్రాంతాలను పరిశీలించి ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటాను. **-రాజేంద్రప్రసాద్‌రెడ్డి, సోములవారిపల్లె, పంచాయతీ కార్యదర్శి**

?: ప్రొద్దుటూరు పట్టణం కొర్రపాడు రోడ్డు సముదాయాల ముందు భాగంలో ఉన్న మురుగుకాలువలో పూడికను బాగా తొలగిస్తే వర్షపు నీరు వెళ్లే అవకాశం ఉంటుంది. దుర్వాసన రాకుండా ఉంటుంది. **-రాజేష్, స్థానికుడు**

✓: మురుగుకాలువల్లో పూడికను కార్మికులు తొలగిస్తున్నారు. యంత్రం ద్వారా పూడికను తొలగించేందుకు చర్యలు తీసుకుంటాను. **-శివకరుణశ్రీ, 4వ వార్డు సచివాలయ పారిశుద్ధ్య కార్యదర్శి, ప్రొద్దుటూరు పురపాలక సంఘం**

?: ప్రొద్దుటూరు పట్టణం శ్రీరాములపేట పట్టణ ఆరోగ్య కేంద్రం వీధి నుంచి గాంధీరోడ్డుకు వెళ్లే వైపు ఉన్న కాలువకు సమాంతరంగా మురుగు నిలిచింది. వర్షపు చినుకు పడితే రోడ్డంతా మురుగునీరుగా మారుతుంది. పూడికను తొలగించడం లేదు. -సుబ్బరాయుడు, స్థానికుడు

✓: పూడిక తొలగింపునకు చర్యలు చేపడతాను.

-గురుశేఖర్, 12వ వార్డు సచివాలయ పారిశుద్ధ్య కార్యదర్శి
-న్యూస్‌టుడే, ప్రొద్దుటూరు పట్టణం

వర్షం... బడికెళ్లాలంటే భయం

పాఠశాల ఆవరణలో పాముల సంచారం ● ఆందోళనలో విద్యార్థులు, తల్లిదండ్రులు



జలదిగ్బంధంలో మోరగుడి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల



ఒకే గదిలో పాఠాలు బోధిస్తున్న ఉపాధ్యాయుడు

- న్యూస్‌టుడే, జమ్మలమడుగు గ్రామీణ

వైకాపా ప్రభుత్వం బడ్జెట్ పాలనలో నాడు-నేడు కింద పాఠశాలల అభివృద్ధి కొన్నింటికే పరిమితమైంది. విద్యార్థుల సంఖ్య ఎక్కువగా ఉన్న పాఠశాలల్లోనే పనులు చేశారు. తక్కువగా ఉన్నచోట భవనాలు శిథిలావస్థలో ఉన్నా కనీసం పట్టించుకోలేదు. ప్రభుత్వ బడుల్లో విద్యార్థులకు కార్పొరేట్ స్థాయిలో అన్ని సౌకర్యాలు అందుతున్నాయని గత ప్రభుత్వం గొప్పలు చెబుతుండేది. క్షేత్రస్థాయిలో పరిస్థితి అందుకు విరుద్ధంగా తయారైంది. గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వ పాఠశాలల పరిసరాలు అధ్వానంగా మారాయి. ఇది ఎక్కడో మారుమూల గ్రామం కాదు. జమ్మలమడుగు మండలం మోరగుడి గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల.

వర్షం వచ్చిందంటే ఇలా జలదిగ్బంధంలో ఉండిపోవాల్సిందే. వాన నీరు ఎటు వెళ్లలేక తరగతి గదిలో, ఆవరణలో నిలిచిపోవడంతో వాటిలో కప్పలు... వాటి కోసం పాములు ఇలా పాఠశాలలో సంచరిస్తున్నాయి. పాముల భయంతో తల్లిదండ్రులు బడులకు తమ పిల్లలను పంపించాలంటే భయాందోళన చెందుతున్నారు. 2023-24 విద్యా సంవత్సరంలో 26 మంది విద్యార్థులు వస్తుండగా నేడు వారి సంఖ్య 14కు చేరింది. వర్షాకాలం వచ్చిందంటే విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులు కూడా ఎప్పుడు ఏం జరుగుతుందోనని ఆందోళన చెందుతున్నారు. విద్యార్థులు మరుగుదొడ్లకు వెళ్లాలన్నా కర్రల సహాయంతో కాపలా ఉండాల్సిన దుస్థితి. ప్రజా ప్రతినిధులు, అధికారులు పట్టించుకోకపోతే విద్యార్థుల సంఖ్య తగ్గి బడి పూర్తిగా మూతపడే పరిస్థితి ఉంది. ఈ విషయమై మండల విద్యాశాఖ అధికారి చంద్రశేఖరరావును 'న్యూస్‌టుడే' వివరణ కోరగా పాఠశాల అభివృద్ధికి ఎటువంటి నిధులు లేవని, పాఠశాల పక్కన ఆవరణం ఎత్తు పెరగడంతో వాన నీరు మొత్తం నిల్వ ఉంటోందని చెప్పారు. పంచాయతీ నిధులతో నీటిని తరలించి సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.



తరగతి గదుల్లో నిల్వ ఉన్న వర్షపు నీరు

పునాదుల్లోనే డివిజన్ కార్యాలయం

వైకాపా హయాంలో రూ.1.9కోట్లతో మొదలు పెట్టిన తెలుగుగంగ డివిజన్ కార్యాలయం, రెండు సబ్ డివిజన్ల భవన నిర్మాణ పనులు పునాదులకే పరిమితమయ్యాయి. బిల్లులు రావని గుత్తేదారుడు రూ.లక్ష విలువైన పనులు చేసి ఆపేశారు. ఆరేళ్లుగా నూతన భవన నిర్మాణ పనులు కార్యరూపం దాల్చలేదు. ఇప్పటివరకు రెండు సార్లు టెండర్లు పిలిచి పనులు అప్పజెప్పారు. సకాలంలో పనులు పూర్తికాకపోవడంతో ఏటా అంచనా వ్యయం పెరుగుతోంది. ఈ విషయాన్ని తెలుగు గంగ ఈఈ చంద్రశేఖర్‌రెడ్డితో 'న్యూస్‌టుడే' ప్రస్తావించగా గుత్తేదారుడు పని ఆపేశారని, మళ్లీ టెండర్లను పిలవనున్నట్లు తెలిపారు.

-ఈనాడు కడప, న్యూస్‌టుడే బద్వేలు



రాయితీతో వంట నూనె ప్యాకెట్ల పంపిణీ

చాపాడు, న్యూస్‌టుడే: చాపాడులోని ప్రభుత్వ చౌకదుకాణంలో వంట నూనె ప్యాకెట్లు రాయితీతో అందిస్తున్నట్లు తహసీల్దారు రమాకుమారి తెలిపారు. నూనె కావాల్సిన వారు రేషన్‌కార్డుతో దుకాణంలో సంప్రదించాలని ఆమె చెప్పారు. ప్రభుత్వం నుంచి ఎలాంటి సరఫరా లేదని, డీలర్ల ఆసక్తితో రాయితీతో నూనె అందిస్తున్నామని వివరించారు. ఆర్ఐ శివశంకర్‌రెడ్డి పాల్గొన్నారు.

చెరువులను పరిశీలించిన నాయకులు

బద్వేలు గ్రామీణ, న్యూస్‌టుడే : బద్వేలులోని పెద్దచెరువు, రాచెరువు, చెన్నంపల్లెలను మంగళవారం మాజీ ఎమ్మెల్యే కె.విజయమ్మ, ఎన్డీయే కూటమి నాయకుడు బొజ్జా రోశన్నతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా తూము గేట్ల మరమ్మతులుంటే వెంటనే చేయించాలని, చెరువు కట్టలు బలహీనంగా ఉంటే నీళ్లు ఎక్కువగా వచ్చినప్పుడు కట్టలు తెగిపోకుండా ఏర్పాట్లు చేయాలని డీఈకి చెప్పారు. నాయకులు వెంగల్‌రెడ్డి, నరసింహనాయుడు, రామసుబ్బారెడ్డి, సుధాకర్‌రెడ్డి, రామచంద్రారెడ్డి, రామిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మారిన అధికారుల పేర్లు

స్పందనకు వందనం

పెద్దముడియం: ఎంపీడీవో కార్యాలయంలో సమాచార హక్కు చట్టం బోర్డుపై అస్తవ్యస్తంగా ఉన్న పేర్ల వివరాలను అధికారులు మంగళవారం సరిచేయించారు. గతంలో పని చేసిన అధికారుల పేర్లే ఉండడంతో కార్యాలయానికి వచ్చే సందర్శకులు గందరగోళానికి గురయ్యేవారు. ఈ విషయంపై మంగళవారం 'అధికారులు మారినా..మారని పేర్లు' అంటూ 'ఈనాడు'లో చిత్రకథనం ప్రచురితమవడంతో స్పందించి సరిచేయించారు.

రూ.16 లక్షలతో మరమ్మతులు

బద్వేలు: బద్వేలు ఆర్టీసీ బస్టాండుకు రూ.16 లక్షలతో అధికారులు మరమ్మతులు చేపట్టారు. బస్టాండులో సమస్యలపై 'ఈనాడు'లో పలుదఫాలుగా కథనాలు ప్రచురితమైంది. ఇందుకు స్పందించిన అధికారులు నిధులు మంజూరు చేసి పనులు చేపట్టారు. ఇప్పటివరకు 70 శాతం పనులు పూర్తికాగా మిగిలిన పనులు పూర్తి కావాల్సి ఉంది.

కార్యదీక్షాపరుడు అబ్దుల్ కలాం



అబ్దుల్ కలాం చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కమిటీ సభ్యులు

క్షిపణి పితామహులు అబ్దుల్ కలాం కార్యదీక్షపరుడని పలువురు వక్తలు కొనియాడారు. మంగళవారం బద్వేలు, మైదుకూరులో అబ్దుల్ కలాం జయంతిని వేడుకగా నిర్వహించారు. బద్వేలు పట్టణ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆ కమిటీ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, గురుమూర్తి తదితరులు పాల్గొన్నారు. మైదుకూరు ఎస్వీ డిగ్రీ కళాశాలలో కూడా ఘనంగా నివాళులు అర్పించారు. క్రీడా మంత్రిత్వ శాఖ, నెహ్రూ యువజన కేంద్రం, అమ్మ సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో కలాం సేవలను గుర్తు చేసుకున్నారు. విద్యార్థులకు అమ్మ పేరుతో మొక్కను నాటాలని కోరుతూ మొక్కలను పంపిణీ చేశారు. ఎన్ఎస్ఎస్ అధికారి శంకర్, సేవా సమితి ప్రతినిధి శివశంకర్, ఆదరణ సంస్థ ప్రతినిధులు కిన్నెర ప్రసన్నకుమార్ పాల్గొన్నారు. **- న్యూస్‌టుడే, బద్వేలు, మైదుకూరు**

మద్యం దుకాణాన్ని తరలించాలని వినతి

ఖాజీపేట, న్యూస్‌టుడే: ఖాజీపేటలో కొత్తగా ఏర్పాటు చేయనున్న ఓ మద్యం దుకాణాన్ని తరలించాలంటూ స్థానికులు అధికారులకు ఫిర్యాదు చేశారు. మైదుకూరురోడ్డులో ఉన్న మద్యం దుకాణం కారణంగా ఇబ్బంది కలుగుతోందంటూ గతంలో స్థానికులు అధికారులకు విన్నవించారు. ఇప్పుడు తాజాగా కొత్త మద్యం దుకాణాన్ని కూడా అక్కడే ఏర్పాటు చేయడంపై ప్రజలు మంగళవారం తహసీల్దారుతోపాటు పోలీసులకు ఫిర్యాదు చేశారు. మద్యం సేవించే వారితో విద్యార్థులు, మహిళలు, పాదచారులకు ఇబ్బంది కలుగుతోందని, మహిళలపై వారి ప్రవర్తన అభ్యంతరకరంగా ఉందంటూ ఫిర్యాదులో పేర్కొన్నారు. ఉన్నతాధికారులు చర్యలు తీసుకొని కొత్తగా ఏర్పాటు చేయబోయే మద్యం దుకాణాన్ని వేరే ప్రాంతానికి తరలించాలని వారు కోరారు.

రోడ్డుపై చెత్త వేసినందుకు జరిమానా

బద్వేలు, న్యూస్‌టుడే: పట్టణంలోని నెల్లూరురోడ్డులో మంగళవారం రోడ్డుపై చెత్త పడేసిన వారికి పురపాలక సంఘ కమిషనర్ నరసింహారెడ్డి జరిమానా వేశారు. స్వప్న బార్ దుకాణం యజమానికి రూ.2 వేలు, ఆటోమొబైల్ దుకాణం యజమానికి రూ.1000లను విధించారు.

పల్లెల ప్రగతే ప్రభుత్వ లక్ష్యం



పెద్దముడియంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, పక్కన తెదేపా నియోజకవర్గ బాధ్యుడు భూపేష్‌రెడ్డి, అధికారులు



పోరుమామిళ్లలో భూమి పూజ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే విజయమ్మ

పెద్దముడియం,. జమ్మలమడుగు గ్రామీణ, పోరుమామిళ్ల, అట్లూరు, ప్రొద్దుటూరు గ్రామీణ, న్యూస్‌టుడే : పల్లెల అభివృద్ధి, ప్రజల సంక్షేమమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని జమ్మలమడుగు భాజపా ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి అన్నారు. మంగళవారం పెద్దముడియం, జమ్మలమడుగు, పోరుమామిళ్ల, అట్లూరు మండలాల్లోని గ్రామాల్లో 'పల్లె పండగ' కార్యక్రమాన్ని నిర్వహించారు. తెదేపా నియోజకవర్గ బాధ్యుడు భూపేష్‌రెడ్డితో కలిసి ఎమ్మెల్యే పెద్దముడియం, జమ్మలమడుగు మండలాల్లో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఉపాధి హామీ పథకం నిధులు రూ.68 లక్షలతో జిల్లా ఉన్నత పాఠశాల ప్రహరీ, సిమెంటు రహదారి నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వంలో రాజోలి జలాశయ నిర్మాణానికి ఎకరాకు రూ.12.50 లక్షల పరిహారం అందిస్తామని చెప్పి రైతుల నుంచి అంగీకార పత్రాలు తీసుకుని అన్యాయం చేశారని మండిపడ్డారు. భూపేష్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రాన్ని అభివృద్ధిపథంలో నడిపించాలన్నదే సీఎం ఆశయమని అన్నారు. జమ్మలమడుగులో ఉపాధి హామీ పథకం నిధులతో గూడెంచెరువు గ్రామంలో రూ.60 లక్షలు, మోరగుడి గ్రామంలో రూ.24 లక్షలకు సిమెంటు రోడ్ల నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. ఆర్డీవో సాయిశ్రీ, సర్పంచులు, ఉపాధి ఏపీడీ రామలింగేశ్వరరెడ్డి, పీఆర్ డీఈ భాస్కర్‌రెడ్డి, కూటమి నాయకులు పాల్గొన్నారు. పోరుమామిళ్ల మండలంలోని రంగసముద్రం, పుల్లివీడులో జరిగిన పూజల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే విజయమ్మ మాట్లాడారు. ప్రభుత్వం గ్రామ పంచాయతీలను ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు శ్రీకారం చుట్టిందన్నారు. ఎంపీడీవో రమణారెడ్డి, భాజపా నియోజకవర్గ నాయకుడు బొజ్జా రోశన్న, నాయకులు కృష్ణారెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు. అట్లూరు మండలంలోని కామసముద్రం, ముత్తుకూరు, వేమలూరు గ్రామాల్లో రూ.60.8 లక్షల నిధులతో 14 పనులకు విజయమ్మ శంకుస్థాపన చేశారు. నాయకులు బొజ్జా రోశన్న, మల్లికార్జునరెడ్డి, రెడ్డయ్య, జయకృష్ణ, అల్లం వెంకటసుబ్బయ్య, అమర్‌నాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు. ప్రొద్దుటూరులోని కామనూరులో రూ.74.20 లక్షలతో అభివృద్ధి పనులకు సర్పంచి షమీమ్ భూమి పూజ చేశారు. ఉపాధి హామీ నిధులతో సీసీ రోడ్లు, ఎంపీపీ ప్రాథమికోన్నత పాఠశాలకు ప్రహరీ నిర్మాణాలను చేపట్టనున్నారు. మాజీ ఎంపీపీ రాఘవరెడ్డి, ఎంపీడీవో సూర్యనారాయణరెడ్డి, డీఈ లక్ష్మీనారాయణరెడ్డి, ఏపీవో మహేశ్వరరెడ్డి, కార్యదర్శి సుభాషిణి, తదితరులు పాల్గొన్నారు.

భారీ జెండాలతో ఊరేగింపు

జమ్మలమడుగు, కొండాపురం, న్యూస్‌టుడే: కులమతాలకు అతీతంగా ప్రజలంతా దస్తగిరి స్వామి పండగను భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. మంగళవారం గ్యార్మీ షరీఫ్ పండగను పురస్కరించుకుని జమ్మలమడుగులోని రెండో వార్డులో కొత్త మసీదు వీధిలో దర్గా నుంచి భారీ జెండాలను పట్టణంలో ఊరేగించారు. ప్రతి ఒక్కరూ ఇతరులపై ప్రేమాభిమానాలతో తమ వంతు దానధర్మాలు చేయాలని పెద్దలు సూచించారు. స్థానిక జామియా మసీదులో దస్తగిరి స్వామి జ్ఞాపికలను ప్రదర్శించారు. అనంతరం జామియా మసీదు పీఠాధిపతి సాధిక్‌పాషా ఖాద్రి ప్రత్యేక ప్రార్థనలు చేసిన అనంతరం భక్తులకు ప్రసాదాన్ని పంపిణీ చేశారు. కొండాపురం మండలంలోని కొండాపురం, బుక్కపట్నం, చౌటిపల్లె గ్రామాల్లో జెండాల ఊరేగింపు నిర్వహించారు. ఆర్అండ్ఆర్ కాలనీలో నిర్వాహకులు అన్నదానం చేపట్టారు.



ప్రార్థనలు చేస్తున్న పీఠాధిపతి సాధిక్‌పాషా ఖాద్రి

శాంతిభద్రతలు అదుపుతప్పితే కఠిన చర్యలు



మాట్లాడుతున్న ఫ్యాక్షన్ జోన్ సీఐ పుల్లయ్య, ఎస్ఐ చిన్నపెద్దయ్య

చాపాడు, న్యూస్‌టుడే: ప్రశాంత వాతావరణంలో ఎవరి పనులు వారు చేసుకోవాలని, శాంతి భద్రతలు అదుపుతప్పితే కఠిన చర్యలుంటాయని ఫ్యాక్షన్ జోన్ సీఐ పుల్లయ్య తెలిపారు. మంగళవారం చిన్నవరదాయపల్లె, నక్కలదిన్నెలో ఆయన ఎస్ఐ చిన్నపెద్దయ్యతో కలిసి పర్యటించారు. చిన్న ఘటనలు జరిగినా తమ దృష్టికి తీసుకురావాలని వారు స్థానికులకు కౌన్సిలింగ్ ఇచ్చారు.

ఆవులను బయటకు వదిలితే కేసులు

ప్రొద్దుటూరు పట్టణం, న్యూస్‌టుడే: ప్రొద్దుటూరు పట్టణం పరిధిలో ఆవుల, ఎద్దుల యజమానుదారులు బయట వదలడం వలన ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతున్నట్లు కమిషనర్ వి.మల్లికార్జున తెలిపారు. వాహనదారులు, పాదచారులకు ఇబ్బంది కలిగిస్తున్నందున ఆవులను, ఎద్దులను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తామన్నారు. 254 సెక్షన్ పురపాలక యాక్టు ప్రకారం న్యూసెన్స్ కేసు నమోదు చేయించి కఠినమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సహచట్టంపై అవగాహన

పోరుమామిళ్ల, న్యూస్‌టుడే: సమాచార హక్కు చట్టం 2005పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఏడీఏ మురళీధర్‌రెడ్డి అన్నారు. పోరుమామిళ్ల రైతు సేవా కేంద్రంలో మంగళవారం 2005 సమాచార హక్కు చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు. సమాచారం కోసం దరఖాస్తు చేస్తే ఎలా సమాచారం ఇవ్వాలనే అంశాలపై అవగాహన కల్పించారు. ఏవో వరహరికుమార్ పాల్గొన్నారు.

రూ.కోట్ల స్థలం... కబ్జాదారుల పరం

యథేచ్ఛగా వంకల ఆక్రమణ



రాచాయిపేటలో ఆక్రమణలతో కుంచించుకుపోయిన ఉప్పు వంక

– న్యూస్‌టుడే, బద్వేలు, గోపవరం

కబ్జాదారులు వంకలు, వాగులను సైతం వదలడంలేదు. రక్షణలేకపోవడంతో ఆక్రమించి వ్యవసాయ భూములుగా మారుస్తున్నారు. బోర్లను వేసి పంటలను సాగు చేస్తున్నారు. గోపవరం మండలం రాచాయిపేటలో సుమారు 50 ఎకరాలకుపైగా ఉన్న వంక పోరంబోకు 40 ఎకరాల వరకు కబ్జాకు గురైంది. ఇక్కడ ఎకరా ఐదు లక్షల మేర ధర పలుకుతోంది. ఈ దామాషా ప్రకారం ఆక్రమణకు గురైన వంకపోరంబోకు సుమారు రూ.2.5 కోట్ల విలువ చేస్తుందని ప్రాథమిక అంచనా. ప్రధాన రోడ్డుకు అతి సమీపంలో ఉండడం, రెవెన్యూ అధికారులు పట్టించుకోకపోవడంతో ఎవరంతటవారు పదేళ్ల నుంచి ఆక్రమించుకుంటూ వస్తున్నారు. ఈ కారణంగా ఎగువన ఉన్న కొండల్లో కురిసిన వర్షపు నీరు, ఎగువన ఉన్న చెరువుల నుంచి వచ్చే అలుగునీరు ఈ వంక నుంచే సోమశిల వెనక జలాల్లోకి వెళ్తుంది. వెడల్పుగా ఉన్న ఈ ఉప్పు వంక ఇరువైపుల ఆక్రమణకు గురై కుంచించుకుపోవడంతో నీరు సాఫీగా వెళ్లే పరిస్థితి లేకుండా పోయింది. ఈ వంక పోరంబోకు స్థలంలోనే శ్మశానాలు ఉన్నాయి. వంక నీరు ఉద్ధృతికి పూడ్చిన శవాలు పైకి తేలి కొట్టుకుపోవడంతోపాటు సమాధులు రూపుకోల్పోవడంతో సంవత్సరీకం చేసుకోవాలన్నా ఇబ్బందులు పడుతున్నట్లు గ్రామస్థులు ఆవేదన చెందుతున్నారు. అనేక పర్యాయాలు గోపవరం రెవెన్యూ అధికారులకు ఆక్రమణకు గురైన వంకపోరంబోకు స్థలాన్ని కాపాడాలని తెలిపినా స్పందనలేదని, జిల్లా కలెక్టర్ చొరవతీసుకుని సర్వే జరిపి ఆక్రమణదారుల నుంచి కాపాడాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ విషయమై గోపవరం తహసీల్దారు త్రిభువనరెడ్డిని 'న్యూస్‌టుడే' వివరణ కోరగా రాచాయిపేటలో ఉప్పు వంక పోరంబోకు స్థలాన్ని పరిశీలిస్తామన్నారు. క్షేత్రస్థాయిలో సర్వే జరిపి కబ్జాదారులపై చర్యలు తీసుకుంటామన్నారు.



వంకపోరంబోకు స్థలంలో సాగైన వరి పంట

కడప

• కడప • పులివెందుల • కమలాపురం

కార్యకర్తలకు అండగా తెదేపా



పార్టీలో చేరిన వారికి పసుపు కండువా వేస్తున్న జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్యే మాధవి

అరవిందనగర్ (కడప), న్యూస్‌టుడే: ప్రతి కార్యకర్తకు అండగా ఉంటూ, వారికి భరోసా కల్పిస్తామని తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్యే మాధవి స్పష్టం చేశారు. కడప నగరంలోని కృష్ణాపురం సమీపంలోని మస్తాన్‌వలీ వీధిలో రిజ్వాన్ హుసేన్ నేతృత్వంలోని పలువురు ముస్లింలు మంగళవారం రాత్రి తెదేపాలో చేరారు. వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని పలువురు పార్టీలో చేరడం అభినందనీయమన్నారు. పార్టీ నాయకులు ఉన్నారు.

విజయ దుర్గాదేవి ఆలయంలో రాహుకాల పూజలు



పూజలు చేస్తున్న మహిళలు

మారుతీనగర్, న్యూస్‌టుడే: స్థానిక బిల్టప్ సమీపంలో వెలసిన విజయదుర్గాదేవి అమ్మవారి ఆలయంలో మంగళవారం రాహుకాల పూజలు ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజాము నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అనంతరం ప్రత్యేక అలంకరణలు చేశారు. పండితులు వేద మంత్రాల నడుమ పంచామృతాభిషేకం నిర్వహించి రాహుకాల పూజలు నిర్వహించారు. ప్రతి శుక్రవారం అభిషేకాలు, సుమంగళి పూజలు, పౌర్ణమికి నవకలశ స్నపనం, చండీహోమం నిర్వహిస్తామని కమిటీ ప్రతినిధులు తెలిపారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM to 1 PM)
కడప : 8008573428, 8688701384
పులివెందుల : 8008573466
కమలాపురం : 8008573475

స్పందనకు వందనం

కడప రెండో గాంధీ విగ్రహం నుంచి అమ్మ వారిశాలకు వెళ్లే దారిలో మసీదు వద్ద చెత్తాచెదారం పేరుకుపోయి దుర్వాసన వస్తోందని 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి స్పందించిన నగరపాలక అధికారులు చెత్తాచెదారాన్ని తొలగించారు. - న్యూస్‌టుడే, చిన్నచౌకు

?: కడప ఆర్టీసీ బస్టాండు ఆవరణలో గత నాలుగు రోజుల నుంచి చెత్తాచెదారం పేరుకుపోయింది. ఆర్టీసీ అధికారులెవ్వరూ పట్టించుకోలేదు. - మోహన్‌కుమార్, కడప.
✓: సంబంధిత కాంట్రాక్టరుకు చెప్పి చెత్తాచెదారాన్ని తొలగించే విధంగా చర్యలు తీసుకుంటాం. - దిల్లేశ్వరరావు, డీఎం, కడప
- న్యూస్‌టుడే, చిన్నచౌకు

?: పెంచికల బసిరెడ్డి జలాశయం(పీబీఆర్) పార్కులో విద్యుత్తు దీపాలు వెలగడం లేదు. దీంతో పర్యాటకులు ఇబ్బందులు పడుతున్నారు. - గోపాల్, పార్నపల్లె
✓: దీపాలకు మరమ్మతులు చేయిస్తాం.
- ఈశ్వరయ్య, పర్యాటక అధికారి

?: వర్షాభావంతో తాతిరెడ్డిపల్లె, కోమన్నూతల, మురారిచింతల, ఎగువపల్లె పరిధిలో పంటలు ఎండిపోతున్నాయి. లింగాల కుడి కాల్వ ద్వారా సాగునీరు అందించాలి. - ప్రసాదు, రైతు
✓: విద్యుత్తు నియంత్రికలకు మరమ్మతులు చేయించి సాగునీటిని తరలిస్తాం. - వెంకట్రామయ్య, కుడికాల్వ ఈఈ
- న్యూస్‌టుడే లింగాల

?: మల్లేలలోని తనిఖీ కేంద్రం వద్ద మురుగునీరు నిలిచి దుర్వాసన వసోతంది. - కృష్ణాతేజరెడ్డి, మల్లేల
✓: మురుగునీరు పారేలా పూడిక తొలగిస్తాం.
- సాయిప్రతాప్‌రెడ్డి, ఈవోపీఆర్డీ, -న్యూస్‌టుడే, తొండూరు

?: వల్లూరు గాంధీ కూడలి నుంచి బస్టాండు గణేష్‌పురం వెళ్లే మార్గంలో వీధి దీపాలు వెలగడం లేదు. - రమేష్, స్థానికుడు
✓: పరిశీలించి వెలగని వీధి దీపాలకు మరమ్మతులు చేయిస్తాం. - శ్రీనివాసులు, కార్యదర్శి - న్యూస్‌టుడే, వల్లూరు

రహదారులు ఛిద్రం... రాకపోకలకు భయం

న్యూస్‌టుడే, అరవిందనగర్, కడప విద్య

కడప నగరంలో పలు రహదారులు అధ్వానంగా మారడంతో రాకపోకలకు ఇబ్బందులు తప్పడం లేదు. పెద్ద గుంతలు, సగం తవ్వేసి వదిలేయడం, ఎగుడు దిగుడు రహదారులతో జనాలు పడే అవస్థలు అన్నీ ఇన్నీకావు. చిన్నచౌక్ ప్రాంతంలోని పలు వీధుల రహదారుల పరిస్థితి మరీ దారుణంగా ఉంది. ఆంజనేయస్వామి గుడి ఎదురుగా నడిరోడ్డుపై పెద్ద గుంత ఏర్పడింది. పోలీసుస్టేషన్ ఎదురుగా ఉన్న రహదారి అస్తవ్యస్తంగా మారింది. రోడ్డు నిర్మించే సమయంలో వాహనాలు వెళ్లిన గుర్తులు అలాగే ఉండటంతో పలువురు అదుపుతప్పి కిందపడి గాయాలపాలవుతున్నారు.

● అప్సర కూడలి సమీపంలోని విద్యుత్తు ఉపకేంద్రం నుంచి నమస్తే బోర్డు వరకు రహదారి పక్కనే గుంతలు తవ్వారు. అక్కడ పెద్ద కుప్పలుగా మట్టి పోసి వదిలేశారు. దీంతో ఆ వీధుల్లో వెళ్లే వారికి ఇబ్బందికరంగా మారింది. పేరుకు డబుల్ రోడ్డుగా ఉన్నా ఈ మట్టి కుప్పలతో అది సింగిల్ రోడ్డుగా మారింది.

● కొండాయపల్లె ఎన్టీఆర్ విగ్రహం ఎదురువీధి నుంచి ముత్తరాసుపల్లె వరకు ఉన్న సిమెంటు రహదారి అత్యంత ప్రమాదకరంగా మారింది. బాగున్న రోడ్డును ఇటీవల కేబుల్ నిర్మాణం కోసం తవ్వారు. దీంతో ఇటువైపు ప్రయాణం నరకంగా మారింది. చిన్నచౌక్ పోలీసుస్టేషన్ పక్క సందులో పెద్ద గుంతలు ఉన్నాయి. కేబుల్ నిర్వాహకులు, ఇటు నగరపాలక సంస్థ అధికారులు పట్టించుకోకపోవడంతో జనాలు పడే అవస్థలు అన్నీ ఇన్నీకావు.

● కడప నగరంలోని వివేకానంద నగర్, ఓం శాంతి నగర్‌లలో అంతర్గత రహదారులు అధ్వానంగా ఉన్నాయి. వర్షం పడితే గుంతల్లో నీళ్లు నిలిచి అపరిశుభ్ర వాతావరణం నెలకొంటోంది. ప్రజాప్రతినిధులు స్పందించి రహదారులు నిర్మించాలని నగరవాసులు కోరుతున్నారు. దీనిపై ఎమ్మెల్యే మాధవి మంగళవారం మాట్లాడుతూ నగరంలో రోడ్ల మరమ్మతులకు చర్యలు చేపడతామని పేర్కొన్నారు.



ముత్తరాసుపల్లెలో గుంతలమయంగా



చిన్నచౌక్ పోలీసుస్టేషన్ పక్కన ప్రమాదకరంగా...



అప్సర కూడలి నుంచి కృష్ణాకూడలి మధ్యలో రోడ్డుపైనే మట్టికుప్పలు



వివేకానందనగర్‌లో రహదారి పరిస్థితి ఇదీ

అబ్దుల్ కలాం గొప్ప దార్శనికుడు



అబ్దుల్‌కలాం చిత్రపటం వద్ద అంజలి ఘటిస్తున్న తులసిరెడ్డి, పక్కన నాయకులు

వేంపల్లె, న్యూస్‌టుడే: భారత మాజీ రాష్ట్రపతి డాక్టర్ అబ్దుల్ కలాం గొప్ప దార్శనికుడని కాంగ్రెస్ పార్టీ ముఖ్య అధికార ప్రతినిధి తులసిరెడ్డి పేర్కొన్నారు. వేంపల్లెలో మంగళవారం అబ్దుల్‌కలాం జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. నాయకులు డాక్టర్ సుబ్రమణ్యం, సుబ్బరాయుడు, ఉత్తన్న పాల్గొన్నారు.

అరవిందనగర్ (కడప): తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అమీర్‌బాబు ఆధ్వర్యంలో కడప రహ్మతీయ ఫంక్షన్ ప్యాలెస్‌లో అబ్దుల్‌కలాం జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. కరీముల్లా, రఫీఖాన్,చాంద్‌బాషా, అమానుల్లా తదితరులు పాల్గొన్నారు.

వైవీయూ (కడప): కోటిరెడ్డి ప్రభుత్వ కళాశాలలో మంగళవారం అబ్దుల్‌కలాం జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. ప్రిన్సిపల్ వి.సలీంబాషా, ఎన్ఎస్ఎస్ పీవో విజయలక్ష్మి, గురుమోహన్‌రెడ్డి, రాజమోహన్‌రెడ్డి, సుబ్రహ్మణ్యం, వీరభద్రయ్య, రవిశేఖర్‌రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎస్టీ వసతి గృహాల పరిశీలన



పరిశీలిస్తున్న జడ్జి బాబా ఫక్రుద్దీన్

కడప న్యాయవిభాగం, న్యూస్‌టుడే: కడప నగరంలోని మరియాపురం, ఐ.టి.ఐ, సర్కిల్, చిన్నచౌకు, బుడ్డాయపల్లిలోని ఎస్టీ బాలురు, బాలికల వసతి గృహాలను జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ జడ్జి ఎస్.బాబా ఫక్రుద్దీన్ మంగళవారం తనిఖీ చేశారు. సమస్యలుంటే హెల్ప్ లైన్ నంబర్ 15100కు తెలపాలని సూచించారు.

సాగునీటి సంఘాల ఎన్నికలకు సన్నద్ధం

పులివెందుల(వేంపల్లె), న్యూస్‌టుడే : సాగునీటి సంఘాల ఎన్నికలకు అన్ని సిద్ధం చేయాలని పులివెందుల తహసీల్దార్ నజీర్ అహమ్మద్ పేర్కొన్నారు. తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం సాగునీటి సంఘాల ఎన్నికలపై సమావేశాన్ని నిర్వహించారు. ఎంపీడీవో రామాంజనేయులు, వీఆర్వోలు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

దివ్యాంగుల సంరక్షణ అందరి బాధ్యత

పులివెందుల(వేంపల్లె), న్యూస్‌టుడే : దివ్యాంగులను సంరక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉందని పురపాలక ఛైర్మన్ వరప్రసాద్ పేర్కొన్నారు. ముద్దనూరు రోడ్డులోని దివ్యాంగుల కమ్యూనిటీ భవనంలో మంగళవారం సీవీ సుబ్బారెడ్డి సతీమణి చవ్వా వేదమణి పెద్దకర్మ సందర్భంగా ఆమె సోదరుడు వైఎస్ మనోహర్‌రెడ్డి ఆధ్వర్యంలో 30 మంది దివ్యాంగులకు నిత్యావసర సరకులు అందజేశారు. వైకాపా పట్టణ కన్వీనర్ గంగాధర్‌రెడ్డి, పురపాలక వైస్‌ఛైర్మన్ అఫీజ్, నూర్‌బాషా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రసూల్, దివ్యాంగుల నెట్‌వర్క్ రాష్ట్ర అధ్యక్షుడు రఘునాథరెడ్డి, పాల్గొన్నారు.

వ్యక్తిపై దాడి... కేసు నమోదు

సింహాద్రిపురం, న్యూస్‌టుడే : బలపనూరులో భార్గవ్ అనే వ్యక్తిపై అదే గ్రామానికి చెందిన చంద్రశేఖర్‌రెడ్డితో పాటు మరో నలుగురు దాడి చేసి గాయపరిచినట్లు ఎస్ఐ తులసీనాగప్రసాద్ తెలిపారు. ఆర్థిక లావాదేవీల విషయమై వివాదం తలెత్తిందని దీంతో తనను కులం పేరుతో దూషించి దాడి చేసినట్లు భార్గవ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

గొంతువాపుతో గేదెల మృత్యువాత

ఒంటిమిట్ట, న్యూస్‌టుడే: వాతావరణంలో వచ్చిన మార్పులతో పశువుల్లో వ్యాధులు ప్రబలుతున్నాయి. మండలంలోని చిన్నకొత్తపల్లిలో కొన్నిరోజులుగా పాడి గేదెలు, దూడలు గొంతు కింద వాపు లక్షణాలతో బాధపడుతున్నాయి. ఇప్పటికే మూడు పశువులు మృతి చెందటంతో పాడి రైతులు ఆందోళన చెందుతున్నారు. విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు తెదేపా మండల శాఖ ప్రధాన కార్యదర్శి కె.బొబ్బిలిరాయుడు తెలిపారు. గొంతువాపు జబ్బు నివారణ కోసం పశువులకు టీకాలు వేయిస్తామని జిల్లా పశు సంవర్ధకశాఖ అధికారి సి.శారదమ్మ తెలిపారు.

ఆటోడ్రైవర్లు బాధ్యతగా వ్యవహరించాలి



కృష్ణా కూడలి వద్ద ఏర్పాటు చేసిన ఆటో స్టాండును ప్రారంభిస్తున్న ట్రాఫిక్ సీఐ జావెద్, ఆటోవాలాలు

కడప నేరవార్తలు, న్యూస్‌టుడే: నగరంలో తిరిగే ప్రతి ఒక్క ఆటోకు పోలీసు నంబరు తప్పనిసరిగా ఉండాలని కడప ట్రాఫిక్ సీఐ జావెద్ అన్నారు. కడప కృష్ణాకూడలి వద్ద కొత్తగా ఏర్పాటు చేసిన ఆటో స్టాండ్‌ను మంగళవారం సీఐ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఆటోడ్రైవర్లు బాధ్యతగా ఉండాలని, పొరపాటున ఆటోల్లో ప్రయాణికులు ఎవరైనా సామగ్రిని మరచిపోతే వారికి అందజేసే విధంగా ఉండాలన్నారు. ప్రతిఒక్కరూ ఖాకీ యూనిఫాం ధరించాలని సూచించారు.

ఆర్ట్సు కళాశాల సీఈగా రామకృష్ణ

వైవీయూ (కడప), న్యూస్‌టుడే: కడప నగరంలోని ప్రభుత్వ పురుషుల కళాశాల (ఆర్ట్సు కళాశాల, స్వయంప్రతిపత్తి) నూతన పరీక్షల నియంత్రణాధికారిగా డాక్టర్ పి.రామకృష్ణ నియమితులయ్యారు. ఈ సందర్భంగా మంగళవారం జిల్లా ప్రభుత్వ కళాశాలల అధ్యాపకుల సంఘం ప్రతినిధులు ఆయనను సత్కరించారు. జీసీటీఏ జిల్లా కార్యదర్శి నీలయ్య, అధ్యాపకులు సురేష్‌బాబు, నాగేశ్వరెడ్డి, మహేష్, వీరనాగేంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే ధ్యేయం



భూమిపూజలో పాల్గొన్న తెదేపా నియోజకవర్గ బాధ్యుడు బీటెక్ రవి

సింహాద్రిపురం, న్యూస్‌టుడే : సింహాద్రిపురంలో పల్లెపండగ కార్యక్రమంలో భాగంగా సీసీ రోడ్డు నిర్మాణానికి మంగళవారం తెదేపా నియోజకవర్గ బాధ్యుడు బీటెక్ రవి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వంలో గ్రామాల్లోని సమస్యలు పరిష్కరిస్తామన్నారు. ఎంపీడీవో కృష్ణమూర్తి, పీఆర్ఏఈ ఉదయ్‌కుమార్‌రెడ్డి, ఈవో వెంకట్రాముడు, ఏపీవో జయభారతి, ఈసీ శ్రీనివాసులరెడ్డి, నాయకులు శ్రీధర్‌రెడ్డి, సునీల్‌రెడ్డి, రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

వేముల: ప్రభుత్వం చేపట్టే అభివృద్ధి పనులతో గ్రామాల రూపురేఖలు మారనున్నాయని తెదేపా రాష్ట్ర ఉపాధ్యక్షుడు పార్థసారథిరెడ్డి పేర్కొన్నారు. పల్లె పండగ వారోత్సవాల్లో భాగంగా మంగళవారం గొందిపల్లెలో పలు అభివృద్ధి పనులకు ఆయన భూమిపూజ చేశారు.

పులివెందుల(వేంపల్లె): గ్రామాల అభివృద్ధికే ప్రభుత్వం పల్లె పండగ కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని పులివెందుల ఎంపీడీవో రామాంజనేయరెడ్డి పేర్కొన్నారు. పల్లెపండగ కార్యక్రమంలో భాగంగా మండలంలోని కానేపల్లె, పుల్రాయునిపేటలో రూ.10 లక్షలతో నిర్మించ తలపెట్టిన సీసీ రోడ్డు, ప్రహరీ నిర్మాణ పనులకు మంగళవారం ఆయన భూమిపూజ చేశారు.

పల్లె పండగతో ప్రగతి: ఎమ్మెల్యే



ఉరుటూరులో అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పుత్తా కృష్ణచైతన్యరెడ్డి

కమలాపురం, న్యూస్‌టుడే : కూటమి ప్రభుత్వం పల్లె పండగ పేరుతో గ్రామాల్లో అభివృద్ధి వెలుగులు నింపడమే ధ్యేయంగా పని చేస్తోందని ఎమ్మెల్యే పుత్తా కృష్ణచైతన్యరెడ్డి అన్నారు. పల్లె పండగ పంచాయతీ వారోత్సవాల్లో భాగంగా మంగళవారం కుంట ఆంజనేయస్వామి గుడి నుంచి చిన్నపురెడ్డిపల్లెకు రూ. 22 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. పలు అభివృద్ధి పనులకు భూమి పూజ చేశారు. ఎంపీడీవో జ్యోతి, పీఆర్ ఏఈ నిరంజన్‌రెడ్డి, హౌసింగ్ ఏఈ ప్రతాప్‌రెడ్డి, ఏపీవో పార్థసారథి, నాయకులు జగన్‌మోహన్‌రెడ్డి, మోపూరి ఎల్లారెడ్డి, రాఘవరెడ్డి, పుత్తా ఎల్లారెడ్డి, సుధాకర్‌రెడ్డి, నారాయణరెడ్డి పాల్గొన్నారు.

వీరపునాయునిపల్లె: వీరపునాయునిపల్లె మండలంలో వివిధ అభివృద్ధి పనులకు రూ.3.44 కోట్ల నిధులు మంజూరయ్యాయని, ఎమ్మెల్యే పుత్తా కృష్ణ చైతన్యరెడ్డి తెలిపారు. మండలంలోని ఉరుటూరులో రూ.20 లక్షలతో చేపట్టే సీసీ రోడ్ల నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. మండల తెదేపా బాధ్యుడు భాస్కరరెడ్డి, ఉపేంద్రారెడ్డి, చంద్రహాసరెడ్డి, పాయసంపల్లె రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చింతకొమ్మదిన్నె: మండలంలోని కొలుములపల్లె, రసూల్‌పల్లె పంచాయతీల్లో రోడ్ల పనులకు మంగళవారం శంకుస్థాపన చేశారు. ఎంపీడీవో కుళాయిబాబు, ఈవోపీఆర్డీ వెంకటసుబ్బారెడ్డి, నాయకులు మహేంద్రారెడ్డి, రవిశంకర్‌రెడ్డి, వెంకటసుబ్బయ్య, స్వాతి పాల్గొన్నారు.

ఈ-పంట నమోదుపై సామాజిక తనిఖీలు

సిద్దవటం, న్యూస్‌టుడే : మండలంలోని వంతాటిపల్లె, మాచుపల్లె, ఉప్పరపల్లె, బొగ్గిడివారిపల్లె, పెద్దపల్లె, తదితర గ్రామాల్లో మంగళవారం ఈ-పంట నమోదుపై సామాజిక తనిఖీలు నిర్వహించారు.

లింగాల: ఈ పంట అర్హుల జాబితాను రైతు సేవాకేంద్రాల్లో ప్రదర్శిస్తున్నామని, రైతులు జాబితా సరిచూసుకోవాలని వ్యవసాయాధికారి రమేష్ సూచించారు.

కమలాపురం: లేటపల్లె రైతు సేవా కేంద్రంలో పంట నమోదు జాబితా అందుబాటులో ఉంచామని ఏవో సరస్వతి తెలిపారు.

అమ్మ పేరుతో మొక్క నాటుదాం



నాటిన మొక్కల వద్ద ఎల్ఐసీ అధికారులు, సిబ్బంది

కడప క్రీడలు, న్యూస్‌టుడే: ప్రతి ఒక్కరూ జన్మనిచ్చిన అమ్మ పేరుతో ఒక మొక్కను నాటి సంరక్షించాలని గాంధీ నగర్ పాఠశాల హెచ్ఎం పుష్పకుమారి, జేబీఎస్ సేవా సమితి వ్యవస్థాపకులు అశోక్ విద్యార్థులకు సూచించారు. నెహ్రూ యువ కేంద్రం, జేబీవీఎస్ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో నగరంలోని గాంధీనగర్ పాఠశాలలో మొక్కలు నాటే కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. తొలుత అబ్దుల్‌కలాం చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

అరవిందనగర్ (కడప): ఆరోగ్యానికి, ఆహ్లాదానికి మొక్కల పెంపకం కీలకమని, ఇది నాగరికతకు చిహ్నమని ఎల్ఐసీ రీజనల్ మేనేజరు సరస్వతిగోపకుమార్ పేర్కొన్నారు. కడప ఎల్ఐసీ డివిజనల్ కార్యాలయంలో ప్లాంట్ ఏ లైఫ్ కార్యక్రమంలో భాగంగా ఆమె మొక్కలు నాటారు. ఎస్డీఎం రవికుమార్, మార్కెటింగ్ మేనేజరు శ్యామసుందరరావు, మేనేజర్లు సత్యశ్రీనివాస్, సత్యప్రసాద్, సంఘాల నేతలు చంద్రపాల్, రఘునాథరెడ్డి, భాస్కర్, రమేష్, హరీంద్రనాథ్ తదితరులు పాల్గొన్నారు.

పులివెందుల(వేంపల్లె) : పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని ఆర్డీవో ప్రత్యూష సూచించారు. ఎన్ఎస్ఎస్, స్నేహిత అమృత హస్తం సేవాసమితి సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం పులివెందుల ఆహారవిజ్ఞాన సాంకేతిక కళాశాలలో అమ్మపేరు మీద మొక్క నాటుదాం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ అధికారులు నివేదిత, జయమ్మ, అరుణ నజ్నూమ, ఫిజికల్ డైరెక్టర్లు రాజశేఖర్, సాయిశ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు

మానవ అక్రమ రవాణా నివారణపై అవగాహన

కడప విద్య, న్యూస్‌టుడే : ప్రతి విద్యార్థి మానవ అక్రమ రవాణాపై అవగాహన కలిగి ఉండాలని కడప మండల విద్యాశాఖాధికారి గంగిరెడ్డి అన్నారు. స్థానిక నగరపాలక ఉర్దూ బాలికల ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయిని జావిదాఖానం అధ్యక్షతన సమావేశం జరిగింది. ఎంఈవో మాట్లాడుతూ బాలికలు పాఠశాల నుంచి ఇంటికి వెళ్లే సమయంలో ఏవైనా ఇబ్బందికర విషయాలు ఉంటే ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు చెప్పాలన్నారు. సామాజికమాధ్యమాలకు బానిస కావొద్దని సూచించారు. మహిళ పోలీస్‌స్టేషన్ ఎస్ఐ శాంత, నగరపాలక పాఠశాలల పర్యవేక్షకులు ఫరూక్‌అహ్మద్, హెడ్‌కానిస్టేబుల్ సహదేవరెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

తలనీలాల సేకరణకు వేలం

సిద్దవటం, న్యూస్‌టుడే : మండలంలోని నిత్యపూజస్వామి కోవెలలో తలనీలాలు సేకరించేందుకు స్థానిక రంగనాయకస్వామి కోవెలలో దేవదాయశాఖ అధికారులు వేలం పాట నిర్వహించారు. చాపాడు మండలం పల్లవోలు ప్రాంతానికి చెందిన రామకృష్ణ అనే గుత్తేదారు రూ.2.35 లక్షలకు వేలాన్ని దక్కించుకున్నట్లు దేవదాయ శాఖ సిబ్బంది తెలిపారు. గత ఏడాది కంటే వేలంలో రూ.1000 ఆదాయం పెరిగినట్లు వారు చెప్పారు.

ఉద్యాన పంటలపై జాగ్రత్తలు అవసరం

సిద్దవటం: వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో రైతులు ఉద్యాన పంటలపై జాగ్రత్తలు తీసుకోవాలని బద్వేలు ఉద్యానశాఖ అధికారి జయభరత్‌రెడ్డి తెలిపారు. సిద్దవటం మండలంలోని పెద్దపల్లె, బొగ్గిడివారిపల్లె గ్రామాల్లో పసుపు, అరటి, మామిడి పంటలను మంగళవారం పరిశీలించారు. పొలాల్లో నిల్వ నీటిని గట్లు తెంపి బయటకు పంపాలన్నారు.

నగరం... జలమయం



ఆర్టీసీ బస్టాండు సమీపంలోని రోడ్డుపై నీరు

అల్పపీడన ప్రభావంతో కడప నగరంలో మంగళవారం రాత్రి భారీ వర్షం కురిసింది. దీంతో రోడ్లన్నీ చెరువులను తలపించాయి. కడప ఆర్టీసీ బస్టాండు పూర్తిగా జలమయమైంది. రైల్వేస్టేషన్‌కు వెళ్లే రోడ్డు మొత్తం మునిగిపోవడంతో వాహనదారులు తీవ్ర అవస్థలు పడ్డారు. మురుగు కాలువలు పొంగి ప్రవహించాయి. - ఈనాడు, కడప, న్యూస్‌టుడే, చిన్నచౌకు

రహదారిపై వాహనాలు ఆపకుండా చర్యలు



అధికారులతో మాట్లాడుతున్న ఎస్పీ హర్షవర్ధన్‌రాజు

వల్లూరు, న్యూస్‌టుడే: కడప-తాడిపత్రి ప్రధాన రహదారిపై వల్లూరు మండల పరిధిలో పలుచోట్ల రోడ్డుకు ఇరువైపులా వాహనాలు ఆగి ఉన్నాయని, వీటి వల్ల రోడ్డు ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని, వెంటనే తగు చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు స్థానిక పోలీసులను ఆదేశించారు. ఆయన మంగళవారం వల్లూరు పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. ప్రధాన రహదారిపై అక్కడక్కడ పోలీసుల అధికారుల చరవాణి నెంబర్లతో బోర్డులను ఏర్పాటు చేయాలని సూచించారు. రికార్డులు పరిశీలించి, పలు సూచనలు చేశారు. డీఎస్పీ వెంకటేశ్వర్లు, సీఐ రోషన్, స్థానిక ఎస్ఐ సంజీవరాయుడు పాల్గొన్నారు.

అడ్డంగా వాహనాలు... ప్రయాణికులకు తిప్పలు



బస్టాండు ఆవరణలో ఇష్టానుసారంగా వాహనాలు పార్కింగ్

కడప ఆర్టీసీ బస్టాండు ప్రాంగణంలో వాహనాలను ఇష్టానుసారంగా పార్కింగ్ చేస్తున్నారు. దీంతో ప్రయాణికులు లోపలకు వెళ్లాలన్నా, బయటికి రావాలన్నా అవస్థలు తప్పడం లేదు. నిబంధనల ప్రకారం బంధువులను బస్సు ఎక్కించేందుకు వచ్చేవారు కేవలం గంట వరకు మాత్రమే వాహనాలను పార్కింగ్ చేసుకునే వెసులుబాటు ఉండేది. తర్వాత డబ్బులు చెల్లించాలి. గతంలో ఉన్న ఈ విధానాన్ని రద్దు చేయడంతో ప్రాంగణం నిండా ద్విచక్రవాహనాలను ఇష్టారాజ్యంగా నిలిపేస్తున్నారు. అధికారులు స్పందించి వాహనాలను క్రమపద్ధతిలో పార్కింగ్ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, కడప చిన్నచౌకు

ఘనంగా గోపూజ

లింగాల, న్యూస్‌టుడే : పార్నపల్లెలోని సాయిబాబా ఆలయ విగ్రహ ప్రతిష్ఠ వేడుకల్లో భాగంగా మంగళవారం వేదపండితులు రాజశేఖరశాస్త్రి ఆధ్వర్యంలో గోపూజ, యాగశాల ప్రవేశం, గణపతి హోమం, దీక్షాహోమం, జలాదివాసం కనులపండువగా నిర్వహించారు. గ్రామస్థులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

సమయపాలన తప్పనిసరి

సిద్దవటం, న్యూస్‌టుడే : పశు సంవర్ధకశాఖలో పనిచేసే అధికార సిబ్బంది తప్పకుండా సమయ పాలన పాటించాలని ఆ శాఖ డిప్యూటీ డైరెక్టరు రమణయ్య తెలిపారు. సిద్దవటంలోని పశు సంవర్ధకశాఖ కార్యాలయాన్ని మంగళవారం తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. ఈ నెల 16వ తేదీ నుంచి జరగనున్న నట్టల నివారణ కార్యక్రమంపై రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. అసిస్టెంటు డైరెక్టరు లక్ష్మీదేవి, సిబ్బంది పాల్గొన్నారు.